ఉష్ణోగ్రత మంగళవారం గరిష్టం : 27.0 కనిష్టం : 16.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఆ రాత్రి ఏం జరిగింది ?

- వెంటపడిన వాహనాల కోసం వేట
- దోచుకెళ్లిన గ్యాంగ్ ఎక్కడిదంటూ దర్యాప్తు
- సీసీ ఫుటేజీ, వేలిముద్రల సేకరణ
- హవాలా నగదు దోపిడీ కేసు ఛేదించే పనిలో పోలీసులు



వాహనం వెనుకభాగంలో నగదు పెట్టేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక డిక్కీ

హిందూపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన హవాలా నగదు దోపిడీ కేసు ఛేదించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. దోపిడీ జరిగిన రోజు రాత్రి ఏం జరిగింది? ఎలా జరిగింది? దోచుకున్నవారు ఎక్కడి నుంచి వచ్చారు? అనే విషయాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 3న తెల్లవారుజామున 3-08గంటలకు పెనుకొండ మండలం హరిపురం వైజంక్షన్ వద్ద హవాలా నగదు తరలిస్తున్న వాహనాన్ని ఐదు వాహనాల్లో వచ్చిన గ్యాంగ్ అటకాయించింది. తర్వాత వాహనంలోని రూ.3.10కోట్లు దోచేసింది. అయితే అటుగా వెళ్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడ జరుగుతున్న తతంగంపై పెనుకొండ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు జాతీయరహదారిపై తనిఖీలు చేపట్టారు. దీంతో పెనుకొండ ఆర్టీఓ కార్యాలయం వద్ద రెండు కార్లు ఆగి ఉండటాన్ని గుర్తించి అటుగా వెళ్లారు. పోలీసు వాహనాలు చూడగానే దుండగులు హవాలా కారును అక్కడే వదిలేసి వేరే కారులో ఉడాయించారు. దీంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అయితే డబ్బు దోచుకెళ్లిన దుండగులు నగదు తరలిస్తున్న వాహన డ్రైవర్‌లను కొంత దూరం తీసుకెళ్లి వదిలేశారు. వారు డబ్బున్న వాహనం జీపీఎస్

(మిగతా 6వ పేజీలో..)

భూ రీసర్వే వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ శ్యాంప్రసాద్



పుట్టపర్తి టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల రీసర్వే, పీజీఆర్ఎస్, స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ల జాబితా మ్యాపింగ్, హౌసింగ్, భూసేకరణ సహా వివిధ రెవెన్యూ అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్‌లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించి రీ ఓపెన్ శాతం పెరగకుండా చూడాలన్నారు. జిల్లాలో కొనసాగుతున్న రీ-సర్వే రెండు, మూడో దశల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం స్పెషల్ సమ్మరీ రివిజన్ మ్యాపింగ్ ప్రగతితో పాటు ఇతర రెవెన్యూ అంశాలపై కూడా సమగ్రంగా సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో జేసీ మౌర్య భరద్వాజ్, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, వీవీఎస్ శర్మ, ఆనంద్ కుమార్, సర్వే శాఖ ఏడీ విజయశాంతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓం.. భీం.. బుస్..



క్రికెట్ మైదానంలో నిర్వహించిన పూజలు

చర్యలు తీసుకోవాలి: శివశంకర్, నల్లచెరువు



మండలంలో కొద్ది రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో స్థానిక గీతామందిరం ఎదురుగా, అలాగే కొద్ది రోజుల కిందట స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, శుక్రవారం అర్ధరాత్రి మేము నివాసముంటున్న ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించారు. ఇది ఎవరు చేస్తున్నది అర్థం కావడం లేదు. ఆకతాయిల పనా లేదా గుప్తనిధుల కోసం చేస్తున్న పూజలా అనే అనుమానం కలుగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి పూజలు నిర్వహిస్తున్న దుండగులను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలి.

నల్లచెరువు మండలంలో క్షుద్రపూజల కలకలం

- ప్రతి పది రోజులకు ఏదో ఒకచోట..
- భయాందోళనలో ప్రజలు





ఆర్ఎంపీ ఇంటి ముందు నిర్వహించిన క్షుద్రపూజలు

నల్లచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాకెట్ యుగంలో కూడా కొందరు మాయగాళ్లు మంత్రతంత్రాలు అంటూ అమాయకులను భయపెడుతున్నారు. ప్రజల మూఢనమ్మకాలు, భయమే పెట్టుబడిగా మండలంలో కొందరు మాయగాళ్లు పెచ్చుమీరిపోతున్నారు. అనేక గ్రామాలలో ప్రతి పది రోజులకు ఒకసారి క్షుద్రపూజల కలకలం రేగుతోంది. వారం రోజుల కిందట స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు తరగతి గది వద్ద రకరకాలైన ముగ్గులు వేసి అందులో నిమ్మకాయలు ఉంచి పసుపు, కుంకుమతో పూజ నిర్వహించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారికి సమీపాన ఉన్న ఆర్ఎంపీ శివశంకర్ ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు గత శుక్రవారం రకరకాల ముగ్గులు వేసి పూలు, నల్లేరు, నిమ్మకాయలతో పాటు ఒక బొమ్మను సైతం ముగ్గులో వేసి పూజలు నిర్వహించినట్లు స్థానికులు గుర్తించారు. ఎప్పుడూ జనసంచారం ఉన్న ప్రాంతంలోనే క్షుద్రపూజ నిర్వహించడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇలాంటి సంఘటనలు చాలానే జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిఘా ఉంచాం



మండలంలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేస్తున్న సంగతి మా దృష్టికి వచ్చింది. పూజలు చేసే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అతి త్వరలోనే వారిని గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- మక్బూల్ బాషా, ఎస్ఐ, నల్లచెరువు

పనిచేయని సీసీ కెమెరాలు

మండల కేంద్రంలో జాతీయ రహదారిపై గతంలో పోలీసు అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అయితే అవి గత కొన్నినెలలుగా పని చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇంత జరుగుతున్నా పోలీసులు అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షుద్రపూజలు నిర్వహిస్తున్న గుర్తుతెలియని దుండగులపై నిఘా ఉంచి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మీ ఎమ్మెల్యే బాగా పని చేస్తున్నారా?

- టీడీపీ అధినాయకత్వం 'ఐవీఆర్ఎస్' ఆరా
- లీడర్, కేడర్ మధ్య అంతరం తగ్గించే యత్నం
- కొన్ని చోట్ల అసంతృప్తి, అసమ్మతి వెలుగులోకి..!
- స్థానిక ఎన్నికలకు శ్రేణులను సన్నద్ధం చేసే దిశగా సర్వే



అనంతపురం క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయింది. త్వరలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో అసెంబ్లీ సెగ్మెంట్లలో మకుటంలేని మహారాజులుగా చలామణి అవుతున్న ఎమ్మెల్యేల పనితీరును తెలుకోవడానికి టీడీపీ హైకమాండ్ సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది? బాగా పనిచేస్తున్నారా..? పర్వాలేదా...? బాగా చేయడం లేదా..? అన్న కోణాల్లో ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏ పార్టీకి ఓటువేస్తారు అని ఆరా తీస్తున్నారు. చాలా నియోజకవర్గాల్లోని ప్రజలు, పార్టీ నాయకులకు మంగళవారం ఫోన్లు వచ్చాయని తెలిసింది.

అక్కడక్కడ అసమ్మతి రాగాలు

వైసీపీ పాలనలో అనేక ఇబ్బందులు పడిన టీడీపీ సీనియర్ నాయకులు ఎందరో ఉన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 18 నెలలు గడిచినా వారికి పార్టీ పదవులుగాని, నామినేటెడ్ పదవులుగాని దక్కక తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలిసింది. కొందరు జూనియర్లకు అవకాశాలు కల్పించి, పాతికేళ్లుగా పార్టీనే నమ్ముకున్న తమకు చాన్స్ ఇవ్వలేదని

(మిగతా 6లో..)

ప్రమాదం.. ప్రయాణం..!

మండలంలో నిత్యం ప్రమాదాలు

- వేగం, అజాగ్రత్తలే కారణం
- బలవుతున్న ద్విచక్ర వాహనదారులు



కస్తూర్బా కాలనీ సమీపంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే కూడలి

ముదిగుబ్బ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగం, అజాగ్రత్త కలగలసి ఎన్నో ప్రాణాలను బలిగొంటున్నాయి. మండలం మీదుగా జాతీయ రహదారి 42 వెళ్తోంది. వాహనదారులు సరైన రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగంగా వెళ్లే సమయంలో మలుపులు, అకస్మాత్తుగా వచ్చే వాహనాలను గుర్తించలేక అనేకమంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని ముదిగుబ్బ బైపాస్, దొరిగల్లు ఘాట్ రోడ్డు, యోగివేమన రిజర్వాయర్ రోడ్డు, కదిరి నుంచి బత్తలపల్లి మధ్యలో ముదిగుబ్బ మండలంలో నాగారెడ్డిపల్లి బ్రిడ్జి, మలకవేముల క్రాస్, నాలుగు మోరీల వద్ద, కస్తూర్బా కాలనీ సమీపంలో, సంకేపల్లి, జొన్నలకొత్తపల్లి, రాళ్ల అనంతపురం వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులే మృత్యువాత పడుతున్నారు. అధికారులు బ్లాక్‌స్పాట్‌లు గుర్తించి సూచిక బోర్డులు, ఫ్లాష్‌లైట్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు(ఫైల్)

ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలు..

- నవంబరు 10న ముదిగుబ్బ బైపాస్‌లో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో పులివెందులకు చెందిన గౌస్ పీరా అక్కడికక్కడే మృతి చెందగా, కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి.
- నవంబరు 18న కదిరి వైపు నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారు మండల కేంద్రంలోని కస్తూర్బా కాలనీ సమీపంలో డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి.
- నవంబరు 27న ముదిగుబ్బ బైపాస్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. మండల కేంద్రానికి చెందిన అక్రం బాషాకు కాలు విరిగి, తలకు తీవ్ర గాయాలయ్యాయి.
- నవంబరు 30న రాళ్ల అనంతపురం క్రాస్ వద్ద రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని కదిరి వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ఈదులపల్లికి చెందిన రామలక్ష్మమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



మండలంలో పదేపదే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను వారం రోజుల క్రితం పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిపై అవగాహన కల్పించాలి.

- చల్లా శ్రీనివాసులు, మండల కార్యదర్శి, సీపీఐ

అవగాహన కల్పించాలి



మండలంలో కార్లు అతి వేగంగా వెళుతున్నాయి. ద్విచక్ర వాహనదారులకు అవగాహన లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ మృత్యువాత పడుతున్నారు. పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రమాదాలు జరిగే చోట అవగాహన కల్పించాలి.

- షేక్ బాబ్జాన్, మండల కన్వీనర్, సీఐటీయూ

నివారణకు చర్యలు తీసుకుంటాం

ఒకే ప్రాంతంలో జరిగే రోడ్డు ప్రమాదాలపై నిఘా పెట్టాం. బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకుంటాం. మితిమీరిన వేగంతో వెళ్లకుండా రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. - శివరాముడు, సీఐ

కదిరి గొడ్డలికి పదునెక్కువ

- అది వైసీపీని నిరంతరం వెంటాడుతుంది
- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'కదిరి గొడ్డలికి పదునెక్కువ. కదిరి గొడ్డలితో వైసీపీ ఒకసారి అధికారంలోకి వస్తే, అదే గొడ్డలి వైసీపీని అధికారం కోల్పోయేలా చేసింది' అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ హాల్‌లో మంగళవారం ఆయన ప్రశాద్ టీమ్‌పై వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కదిరి గొడ్డలి పేరు ఎత్తితే, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ఆపార్టీ నాయకులు ఉలికి పడుతున్నారన్నారు. అంత ఉలికిపాటు ఎందుకని ప్రశ్నించారు. మీనాయకుడు తప్పు చేశాడు కాబట్టే తత్తరపోతున్నాడని చెప్పారు. కదిరి గొడ్డలి నిరంతరం వైసీపీని వెంటాడుతూనే ఉంటుందని, ఇది చరిత్ర అన్నారు. కదిరి గొడ్డలి గురించి తాము చెప్పలేదని, సీబీఐ కదిరిలో గొడ్డలి కొన్నట్లు రికార్డుల్లో పొందుపరచిందన్నారు. మీబాబాయిని చంపినట్లుగానే కదిరిలో కందికుంట ప్రసాద్‌ను చంపినా, గొడ్డలి దయ్యమై సాధిస్తుందని హెచ్చరించారు. అధికారం కోసం గొడ్డలితో బాబాయిని చంపే కుసంస్కారం కదిరి ప్రజలకు లేదన్నారు. రోడ్లు, నీళ్ల, అభివృద్ధి గురించి మీరా మాకు చెప్పేదని వైసీపీని ఎద్దేవా చేశారు. కదిరి తనకు కన్నతల్లితో సమానమన్నారు. ఊరు బాగుకోసం అంతర్జాతీయ సంస్థ కేపీఎంజీ సంస్థతో డీపీఆర్ తయారు చేస్తున్నామని తెలిపారు. రాజకీయంలో గెలుపు, ఓటములు సహజమని, పది సంవత్సరాలుగా ఎన్నో అవమానాలు, బాధలు ఎదుర్కొన్నానన్నారు. తనను నమ్మి ఓటు వేసిన ప్రజలకు పనులు చేయడం తన కర్తవ్యమన్నారు.

రేపు వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

- హాజరు కానున్న మధ్యప్రదేశ్ సీఎం



వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్, బీజేపీ నేతలు

ధర్మవరం/పుట్టపర్తిరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ ఏర్పాట్లను ఎస్పీ సతీశ్‌కుమార్ బీజేపీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పట్టణంలో గురువారం వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించనున్న విషయం తెలిసిందే. విగ్రహావిష్కరణతోపాటు ధర్మవరంలో ప్రారంభం కానున్న అటల్-మోదీ సుపరిపాలన బస్సు యాత్రకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ హాజరవుతున్న నేపథ్యంలో బీజేపీ నేతలు ఏర్పాట్లను ఘనంగా చేస్తున్నారు. దీంతో ఎస్పీ సతీశ్‌కుమార్, డీఎస్పీ హేమంత్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు సభాస్థలిని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. హెలీప్యాడ్ పనులు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రూట్‌మ్యాప్, బందోబస్తుపై ఎస్పీ సంబంధిత విభాగాల అధికారులతో సమీక్షించారు.

విజయవంతం చేయండి

భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 11న ధర్మవరం కాలేజ్ సర్కిల్‌లో విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు కేంద్ర రాష్ట్రనాయకులు హాజరవుతారన్నారు. జిల్లాలోని కూటమి పార్టీల నాయకులు, ప్రజలు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

ఏమిటీ నిర్లక్ష్యం..?

మీ పిల్లలకు ఇలాగే పెడతారా..?

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి ఆగ్రహం

నాగసముద్రం హెచ్‌ఎంకు షోకాజ్



కాలంచెల్లిన చిక్కీలను పరిశీలిస్తున్న గంజిమాల దేవి



సీకేపల్లి ఉన్నత పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తూ...

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడంలో ప్రభుత్వం ఎక్కడా రాజీపడటం లేదు.. ఇక్కడ పూర్తి నిర్లక్ష్యం, అజాగ్రత్త కనిపిస్తున్నాయి.. ఇంట్లో మీ పిల్లలను ఇలాగే చూసుకుంటారా..? వారికి ఏదైనా జరిగితే ఎవరిది బాధ్యత..? నిర్లక్ష్యంతో పిల్లల జీవితాలతో ఆడుకుంటారా..? కాలంచెల్లిన చిక్కీలు పాఠశాలలో ఎందుకు ఉన్నాయి..' అంటూ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నాగసముద్రం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఈవోను ఆదేశించారు. చెన్నేకొత్తపల్లి మండలంలో ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నాగసముద్రం ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట తయారు చేయడం, అరకొర సరుకులు, కాలం చెల్లిన చిక్కీలు కనిపించడంతో ఆమె ప్రధానోపాధ్యాయుడు సాయినాథ్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పైనా ఫోన్‌లో మండిపడ్డారు. హెచ్‌ఎం సాయినాథ్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీచేయాలని అక్కడే ఉన్న డీఈవో కిష్టప్పను ఆదేశించారు. కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకు ముందు ఉదయం చెన్నేకొత్తపల్లిలో ఆమె విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్సీ బాలుర హాస్టల్, అంగన్‌వాడీ కేంద్రాలు, పౌరసరఫరాల స్టాక్ పాయింట్, ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ప్రభుత్వ చౌక ధాన్యపు డిపోలను తనిఖీ చేశారు. కోడిగుడ్లు చిన్నగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీలో తరగతులకు వెళ్లి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ పాయింట్‌లో బియ్యం బస్తాల తూకాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందిస్తున్న తీరును అడిగితెలుసుకున్నారు. రేషన్‌షాపును సందర్శించి పంపిణీని పరిశీలించారు. స్టాక్ పాయింట్ నుంచి వచ్చే ధాన్యం తూకాలలో తేడాలుంటున్నాయని, ఈ నెల కోటాలో 68 కిలోలు తక్కువ ఉందని డీలర్ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై విచారించి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. తనిఖీల్లో పౌరసరఫరాలశాఖ ఏడీఎం సాయి, ఏఎస్‌ఓ సింధూబాయి, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డీఈఓ క్రిష్టప్ప, తహసీల్దార్ సురేశ్ కుమార్, ఎంపీడీఓ బాలకృష్ణుడు, ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు, సీడీపీఓ కవితాదేవి తదితరులు ఉన్నారు.

మీ ఎమ్మెల్యే బాగా పనిచేస్తున్నారా..?

(5వ పేజీ తరువాయి)

పలువురు సీనియర్ నాయకుల్లో కాస్త అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఐదారేళ్ల కింద పార్టీలోకి వచ్చిన వారికి, జూనియర్లను సైతం డైరెక్టర్, ఇతర పదవులు వరించాయి. దీంతో పోస్టులు వచ్చినవాళ్లు ఆనందంగా ఉంటే...దశాబ్దాల పాటు పార్టీని అంటిపెట్టుకుని ఉన్న సీనియర్లకు పదవులు దక్కపోవడంతో వారితో కొందరిలో అసమ్మతి కనిపిస్తోంది. దీనికితోడు గత ఐదేళ్లు కష్టపడినా తమను గుర్తించడంలేదన్న ఆవేదన కూడా కొందరు తెలుగు తమ్ముళ్ల గళం నుంచి వినిపిస్తోంది. ఇదే విషయాన్ని ఇటీవల కొందరు పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కళ్యాణదుర్గం వచ్చినప్పుడు కూడా కొందరు ఆయన దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. 'మీరు ఇళ్లలో కూర్చొని బాధపడితే మాకు ఎలా తెలుస్తుంది? సమస్య ఏదైనా మా దృష్టికి తీసుకురావాలి' అంటూ లోకేశ్ పార్టీ శ్రేణులకు సూచించారు.

స్థానిక సమరానికి సిద్ధమేనా...?

మరో ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం తథ్యమని పార్టీ వర్గాల సమాచారం. ప్రస్తుతం మెజారిటీ స్థానిక సంస్థల్లో వైసీపీ ప్రజాప్రతినిధులే ఉన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు, జిల్లాపరిషత్‌లో వైసీపీ నాయకులే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నారు. నాటి మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలో తాడిపత్రి మినహా అన్నీ వైసీపీ కైవసం చేసుకుంది. పంచాయతీ ఎన్నికల్లోనూ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీనే మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. స్థానిక నేతల పదవీకాలం త్వరలో ముగియనున్న నేపథ్యంలో కొన్ని చోట్ల వైసీపీ నాయకులు దాడులకు దిగుతున్నారు. పంచాయతీల పాలనా గడువు వచ్చే ఏప్రిల్, మున్సిపాలిటీల గడువు మార్చిలో ముగియనుంది. ఇన్నాళ్లు అధికారాన్ని అనుభవించిన వైసీపీ నాయకులు...ఇప్పుడు టీడీపీ నేతల చేతుల్లోకి అధికారం పోతోందన్న అక్కసుతో తెలుగుతమ్ముళ్లపై దాడులకు తెగబడుతున్నారు. దీంతో గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. మరో వైపు కూటమి ప్రభుత్వం త్వరలో స్థానిక ఎన్నికలకు వెళ్లేందుకు సమాయత్తం అవుతోంది. సూపర్ సిక్స్ పథకాల అమలుతో ఎన్నికల హామీ నిలబెట్టుకున్న ప్రభుత్వంపై సర్వత్రా సానుకూలత వ్యక్తం అవుతోంది. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు లబ్ధిదారులకు ప్రభుత్వం పట్ల సానుకూలత పెంచినట్లు స్పష్టం అవుతోంది. ఈనేపథ్యంలోనే గత సార్వత్రిక ఎన్నికల్లో మాదిరే స్థానిక ఎన్నికల్లోనూ విజయం సాధించాలనే ఆలోచనలో అధికారపార్టీ ఉంది. ఎన్నికలకు వెళ్లే నేపథ్యంలోనే టీడీపీ అధిష్టానం రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల పనితీరుపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

ఎట్లా పని చేస్తున్నారు?

తెలుగుదేశం పార్టీ హైకమాండ్ తమ పార్టీ ఎమ్మెల్యేల పనితీరు తెలుసుకోడానికి సిద్ధమైంది. 18 నెలలుగా మీ ఎమ్మెల్యే ఎలా పనిచేస్తున్నారంటూ ఐవీఆర్ఎస్ సర్వే చేస్తోంది. రానున్న స్థానిక ఎన్నికల్లో ఎమ్మెల్యేల పాత్ర కీలకం. గెలవాలంటే పార్టీలోని సీనియర్లను, జూనియర్లను, ఇతర కేడర్‌ను సమన్వయం చేసుకోవాలి. ఆ బాధ్యత ఎమ్మెల్యేలు నిర్వహిస్తే గెలుపు సులవవుతుంది. కొన్ని నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలు, అధిపత్య పోరు సాగుతోంది. తమను దూరం పెడుతున్నారంటూ.. కొందరు నేతలు ఎమ్మెల్యేలకు దూరంగా ఉంటున్నారు. కొందరు అక్కడే ఆగితే....మరికొందరు ఏకంగా పార్టీ హైకమాండ్ వరకూ వెళ్లి...ఫిర్యాదు చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు అందరినీ కలుపుకుని వెళ్లడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గడిచిన 18 నెలల్లో వాళ్లు ఎలా పని చేశారో...తెలుసుకోడానికి, రానున్న ఎన్నికల కాలానికి పార్టీలోని లీడర్లు, కేడర్ మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి, వారందరినీ ఏకతాటిపై నడిపేందుకు టీడీపీ అధిష్టానం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మంగళవారం ఐవీఆర్ఎస్ ద్వారా శింగనమల, అనంతపురం, కళ్యాణదుర్గం, ఉరవకొండ తదితర నియోజకవర్గాల ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల అభిప్రాయం తెలుసుకున్నారు.

ఆ రాత్రి ఏం జరిగింది?

(5వ పేజీ తరువాయి)

ట్రాకింగ్‌తో పెనుకొండ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వారు వచ్చాక అసలు విషయం పోలీసులు తెలుసుకుని అందులో రూ.1.20కోట్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

వెంటపడిన వాహనాలు ఎక్కడివి..?

హవాలా నగదు దోపిడీ కేసు నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. దోపిడీకి ముందు ఆరోజు రాత్రి ఏం జరిగింది? డబ్బు తరలిస్తున్న వాహనాన్ని వెంబడించిన వాహనాలు ఎక్కడివి? అవి ఎక్కడి నుంచి వచ్చాయి? ఏ రహదారిలో వచ్చాయనే దానిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. అసలు ఆరోజు రాత్రి నగదున్న వాహనం ఎక్కడెక్కడ ఆపారు? అక్కడ వాహనాలు ఏవైనా అనుసరించాయా? వెంటాడిన వాహనాలు ఏ రాష్ట్రానికి చెందినవి? ఆ దుండగులు ఎవరనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ నగదు సూరత్ నుంచి బెంగళూరుకు వెళ్తున్నట్లు వాహన డ్రైవర్లు చెప్పారు. ఈ కారులో నగదు ఉన్నట్లు దోపిడీ చేసిన దుండగులకు ఎలా తెలుసు? వారు ఈ వాహనాన్ని ఎలా పసిగట్టారు అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. దోపిడీ చేయడానికి ముందుగా ప్లాన్ చేసుకున్నారా? లేక అప్పటికప్పుడే స్కెచ్ వేశారా అనే కోణంలో విచారణ చేపట్టారు. ఈ వాహనాల కోసం పోలీసులు వేటాడుతున్నారు.



నగదుతో పట్టుబడిన వాహనం ఇదే

దోపిడీ గ్యాంగ్ ఎక్కడిది ?

ఇలాంటి ఘటనలు మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎప్పుడైనా జరిగాయా? జరిగి ఉంటే ఎప్పుడు ఎక్కడ జరిగింది ఏ తరహాలో దోపిడీ చేసిందన్న విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒక వేళ దోపిడీ ఘటనలు జరిగి ఉంటే ఆ గ్యాంగ్ ఏ రాష్ట్రానికి చెందినదన్న విషయంపై పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 2022లో ఈ తరహాలోనే రాప్తాడు వద్ద జరిగినట్లు తెలిసింది. అయితే నగదు ఇంతపెద్ద మొత్తంలో తరలిస్తున్నట్లు ఆ గ్యాంగ్‌కు ముందుగానే ఎలా తెలిసి ఉంటుంది? వాహనాన్ని సినిమా ఫక్కీలో అడ్డగించి డ్రైవర్లను కిడ్నాప్‌చేసి నగదును దోచుకెళ్లిన ఘటనను చూస్తే ఇది ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అలా ముందుగా స్కెచ్ వేయాలంటే ఆ డబ్బు ఎక్కడి నుంచి తరలిస్తున్నారన్న సమాచారం వారికి ముందుగానే పక్కాగా తెలిసి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

ఆధారాల సేకరణలో అధికారులు

ఈ కేసు ఛేదించడానికి పోలీసులు బలమైన ఆధారాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఆ రోజు రాత్రి హవాలా నగదు తరలించే వాహన డ్రైవర్లు సూరత్ నుంచి వస్తూ ఎక్కడెక్కడ వాహనాన్ని ఆపారు, ఆపి ఉంటే వారు అక్కడ ఎవరితోనైనా మాట్లాడారా? ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక బెంగళూరు వరకు ఆరోజు రాత్రి సీసీపుటేజ్‌లు తీసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. నగదు తరలించే వాహనంపై పడిన వేలిముద్రలు సేకరిస్తున్నారు. దీనిపై రెండు బృందాలు కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణలో గాలిస్తున్నాయి. సంచలనం రేకెత్తించిన ఈ కేసును డీఐజీ, జిల్లా ఎస్పీ సీరియస్‌గా తీసుకుని విచారణ చేస్తున్నారు.

ప్రాణం పోసిన పెద్దాస్పత్రి

- పాముకాటు నుంచి కోలుకున్న శివరామరాజు



శివరామరాజుతో తల్లి లక్ష్మి, డాక్టర్లు

అనంతపురం వైద్యం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఒక చిన్నారి మృతిచెందగా, మరో చిన్నారికి పెద్దాస్పత్రి వైద్యులు ప్రాణం పోశారు. దీంతో తల్లిదండ్రులు వీరనారాయణ స్వామి, లక్ష్మి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 'చిన్న కుమారుడిని కోల్పోయం.. పెద్ద కుమారుడికి పునర్జన్మనిచ్చిన పెద్దాస్పత్రి డాక్టర్లు మా దేవుళ్లు' అని లక్ష్మి అన్నారు. పెద్దవడూరు మండలం కండ్లగూడురుకు చెందిన వీరనారాయణ స్వామి, లక్ష్మి దంపతులకు శివనారాయణ(7), శివరామరాజు(10) సంతానం. ఈ నెల 2వ తేదీన నలుగురూ ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఇద్దరు చిన్నారులను కట్లపాము కాటు వేసింది. ఇద్దరినీ పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, శివనారాయణ మృతి చెందాడు. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న శివరామరాజును అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకువచ్చారు. నాలుగురోజుల శివరామరాజు కోమాలో ఉన్నాడు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్ పర్యవేక్షణలో వైద్యులు చికిత్స అందించి, ప్రాణాలను నిలబెట్టారు. కోలుకున్న శివరామరాజును సోమవారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, వైద్య బృందానికి లక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు. బాలుడు అడ్మిషన్ అయిన వెంటనే పాము కాటు లక్షణాలను వైద్యులు గుర్తించారని, విరుగుడుకు తగిన మందులు ఇచ్చారని సూపరింటెండెంట్ తెలిపారు. కృత్రిమంగా శ్వాస అందిస్తూ, నిరంతరం పర్యవేక్షిస్తూ.. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది బాలుడి ప్రాణాలను నిలిపారని అభినందించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగం వైద్యులు ప్రవీణ్‌డీన్ కుమార్, భాస్కర్ నాయక్, సంజీవప్ప, మమత, ప్రత్యూష, రాధిక, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మలాబాయి తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 6వ రాష్ట్ర స్థాయి యోగాసన సబ్‌జూనియర్ పోటీలు ఈనెల 12వతేదీ నుంచి జిల్లాకేంద్రంలో నవనిర్వహించనున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం స్థానిక యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 12వతేదీ నుంచి మూడు రోజుల పాటు యోగాసన సబ్‌జూనియర్ పోటీలు పీవీకేకే కాలేజీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 14 ఏళ్ల వయసు లోపు బాల, బాలికలు రాష్ట్ర వ్యాప్తంగా పోటీలకు హాజరవుతారన్నారు. ఏపీ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పోటీలు ఉంటాయన్నారు. ఇందులోని విజేతలు జనవరి 2వతేదీ నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయ స్థాయి సబ్‌జూనియర్ యోగాసన పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత గల బాల, బాలికలు సమీపంలోని యోగా కోచ్‌లు, పీడీలను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కేవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సకాలంలో స్పందించండి

- ఎస్ఈ శేషాద్రిశేఖర్ ఆదేశం

అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్ పరమైన సమస్యలపై సకాలంలో స్పందించాలని విద్యుత్ అధికారులకు, ఉద్యోగులకు ఆ శాఖ ఎస్ఈ శేషాద్రిశేఖర్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వినియోగదారులు ఫోన్ ద్వారా సమస్యలు తెలిపారు. ముఖ్యంగా లోటెన్షన్, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, విద్యుత్ కనెక్షన్ల మార్పుపై విన్నవించారు. జిల్లా వ్యాప్తంగా 14 మంది సమస్యలు తెలిపినట్లు ఎస్ఈ తెలిపారు. సమస్యలను పదిరోజుల్లో పరిష్కరించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ ప్రసాద్, కమర్షియల్ డీఈఈ రామకృష్ణ, టెక్నికల్ ఏఈఈ భానుప్రకాష్, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కార్యదర్శుల నియామకం

అనంతపురంరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులను నియమిస్తూ ఎంపీడీఓ దివాకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రూరల్, ఉప్పరపల్లి, ఎ.నారాయణపురం, రాచానపల్లి, రుద్రంపేట పంచాయతీల్లో పని చేస్తున్న గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఇటీవల ఉద్యోగోన్నతి పొందారు. ఈక్రమంలోనే రుద్రంపేట తప్పా మిగిలిన పంచాయతీలోని వారందరూ రిలీవ్ అయ్యారు. దీంతో వారి స్థానాల్లో ఎంపీడీఓ ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించారు. ఎ.నారాయపురం పంచాయతీ కార్యదర్శిగా మండల డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడుకు ఇది వరకే అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక రాచానపల్లికి కురుగుంట కార్యదర్శి సర్దార్ వలిని, ఉప్పరపల్లికి తాటిచెర్ల కార్యదర్శి నరేంద్రబాబును, అనంతపురం రూరల్ పంచాయితీకి రాజీవ్‌కాలనీ పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రను ఇన్‌చార్జిగా నియమించారు.

ఎప్పుడు ఇస్తారో..?

ఎన్నికల బిల్లులకు మోక్షమేదీ? పెండింగ్‌లో రూ. 6.87కోట్ల బిల్లులు

- ఎమ్మెల్సీ ఎన్నికలవి రూ.3 కోట్లపైబడి
- 18నెలలుగా ఎదురుచూపులు
- ప్రతిపాదనలు పంపినా స్పందన కరువు

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు పూర్తయి 18నెలలవుతున్నా అందుకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో ఆయా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతి సార్వత్రిక ఎన్నికల లాగానే ఈ సారి కూడా బిల్లులు పాస్ కావడంలో ఆలస్యమవుతోంది. జిల్లాలో అనంతపురం, శింగనమల, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, రాప్తాడు నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణకు భారీగా ఖర్చు చేశారు. తొలుత నాలుగు విడతలుగా నిధులు కేటాయించారు. అనంతరం అవసరమై ప్రతిపాదనలు పంపినా రాలేదు. దీంతో ఉద్యోగుల నుంచి వ్యాపార వర్గాల వరకు నిధులు ఖర్చు చేసినా బిల్లులు రాలేదు. బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్ఓ)ల నుంచి ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు సైతం రెమ్యునరేషన్ అందకపోవడంతో ఆ వర్గాల్లో అసంతృప్తి నెలకొంది. అధికారులు ప్రతి నెలా బిల్లులు పాస్ చేయాలంటూ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నా స్పందన కరువైందని సమాచారం.



రూ.6.87కోట్లు పెండింగ్

జిల్లాకు ఎన్నికల సమయంలో కేటాయించిన నిధుల కంటే అదనంగా కోరిన డబ్బే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. జిల్లా కేంద్రం కావడంతో అనంతపురం నియోజకవర్గానికి నాలుగు విడతలుగా రూ.147, 89000లు నిధులు కేటాయించారు. కానీ మరోసారి 1.23కోట్లు అవసరం ఉందని అధికారులు ప్రతిపాదనలు పంపారు. కానీ ఆ నిధులు రాలేదు. ఎన్నికల సమయంలో రోజుకు పీఓకు రూ.2100లు, ఏపీఓకు రూ.1300లు, ఓపీఓకు రూ.500, బీఎల్ఓలకు రూ.350లు ప్రకారం ఇస్తున్నట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఎనిమిది రోజులు కొనసాగింది. పోస్టల్ బ్యాలెట్‌కు పీఓకు రూ.350లు, ఏపీఓకు రూ.350లు, రూ.ఓపీఓలకు రూ.250లు కేటాయించారు. కాగా కొంతవరకే నిధులు ఇచ్చారని, ఇంకా చాలా మంది సిబ్బందికి ఇవ్వలేదనే ఆరోపణలు వచ్చాయి. ఇక షామియానాలు, కుర్చీలు, టిఫిన్లు, భోజనాలు ఇతరత్ర వాటికి లెక్క లేకుండా పోయిందనే విమర్శలున్నాయి. వాహనాలు సమకూర్చినవారు, భోజనాలు అందించిన హోటళ్ల బిల్లులు భారీగా ఉన్నట్లు సమాచారం. వీటిలో కొంతవరకే నిధులు ఖర్చు చేసినా ఇంకా ఇవ్వాల్సిన వారికి పెద్ద మొత్తంలోనే బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి రూ.6,87,81,582కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఇందులో మెటీరియల్‌కు సంబంధించి షామియానాలు, కుర్చీలు, ఇతర సామగ్రి, భోజనాల ఖర్చు, వాహనాల వినియోగానికి సంబంధించి మొత్తం రూ. 4.8కోట్ల బిల్లులు అందాల్సి ఉంది. ఉద్యోగుల టీఏ, డీఏలకు సంబంధించిన ఎన్నికల బిల్లు రూ.1.92కోట్లు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఇక కౌంటింగ్ రోజుకు సంబంధించి మరిన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. బిల్లుల కోసం ఆయా వర్గాల వ్యక్తులు తరచూ కలెక్టరేట్‌కు వస్తుండటంతో 'ప్రతిపాదనలు పంపాం. మా చేతుల్లో ఏం లేదని' అధికారులు చెబుతున్నారు. మరోవైపు 2022లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఖర్చుకు పెట్టిన బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. పబ్లికేషన్ చార్జెస్ రూ.2.49కోట్లు, వాహనాల ఖర్చు రూ.90లక్షలు పెండింగ్‌లోనే ఉంది.



కలెక్టరేట్

భారీగా మెక్కేసిన రెవెన్యూ అధికారులు



సార్వత్రిక ఎన్నికలు వస్తే చాలు అప్పనంగా తినేయడానికి కొందరు అధికారులు సిద్ధంగా ఉంటారు. ఎన్నికల సందర్భంలో తహసీల్దార్ల నుంచి ఆర్డీఓల వరకు ఇతర ప్రాంతాల వారిని నియమిస్తారు. వారిలో కొందరూ 2024 ఎన్నికల నిధులను భారీగానే మెక్కేసినట్లు సమాచారం. అనంతపురం నియోజకవర్గానికి అత్యధికంగా రూ.1.47కోట్లు కేటాయించగా, మిగిలిన నియోజకవర్గాలకు రూ.70లక్షల నుంచి రూ.80లక్షల వరకు కేటాయించారు. ఇదే అదనుగా కొందరు రెవెన్యూ అధికారులు ఆ సొమ్మును తమ జేబులోకి మళ్లించుకున్నారు. అనంతపురం నియోజకవర్గంలో ఓ కీలక రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారి, మరో తహసీల్దార్ కలిసి దాదాపు రూ.40లక్షల వరకు నిధులు మళ్లించినట్లు సమాచారం. హోల్‌సేల్‌గా మెటీరియల్ తీసుకోవడం, ఖర్చులో ఒక్కో వస్తువుకు ప్రత్యేకంగా చూపించి ఆ ముసుగులో ఎన్నికల సొమ్ము పక్కదారి పట్టించినట్లు తెలిసింది. ఆ క్రమంలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి కూడా డబ్బు ఇవ్వలేదనే ఆరోపణలు వినిపించాయి. ఆ తరువాత సంబంధిత అధికారులు మరో జిల్లాకు వెళ్లిపోవడంతో లెక్కలు తేల్చేవారే లేకపోయారు. దీనికి తోడు ఎన్నికల నిధులకు ఆడిట్ లేకపోవడం ఆ అధికారులకు బాగా కలిసొచ్చింది.

ప్రతిపాదనలు పంపాం



రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల పరిధిలో ఎన్నికల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా పరిధిలో రూ.6కోట్లకు పైగా పెండింగ్ ఉంది. ఈ విషయంపై ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. తాజాగా జరిగిన వీసీలో చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ దృష్టికి పెండింగ్ బిల్లుల విషయం తీసుకెళ్లాం. త్వరలోనే బిల్లులు విడుదల అయ్యే అవకాశం ఉంది.

- మలోల, డీఆర్ఓ

మూత దిశగా..!

సమస్యల వలయంలో తపాలా ఆధార్ సెంటర్లు

- 14కిగాను ఆరు మాత్రమే వినియోగంలో...
- మిగిలినవి తాత్కాలికంగా మూత
- టెక్నికల్, సిస్టం, సర్వర్ సమస్యలతోనే..
- కొరవడిన పర్యవేక్షణ
- గ్రామీణ ప్రజలకు తప్పని తిప్పలు



ఆధార్ కేంద్రం వద్ద వేచి ఉన్న కార్డుదారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆధార్ సెంటర్లు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆ శాఖ ఆధార్ సెంటర్లను ప్రవేశపెట్టింది. వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అవి మూత దిశగా పయనిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా తపాలాశాఖ ఆధ్వర్యంలో 14 ఆధార్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. మొదట్లో అన్నీ సక్రమంగానే పనిచేశాయి. రానురాను పర్యవేక్షణ లోపించడం, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో కొందరు అధికారుల నిర్లక్ష్యం వెరసి ఆధార్ సెంటర్లు తాత్కాలికంగా మూతవేయాల్సిన దుస్థితి దాపురించింది. జిల్లావ్యాప్తంగా 14 సెంటర్లు ఉండగా... అందులో గుంతకల్లు హెచ్‌ఓ, అనంతపురం హెచ్‌ఓ, జార్జిపేట ఎస్‌ఓ, యాడికి ఎస్‌ఓ, నార్పల ఎస్‌ఓ, తిమ్మనచర్ల ఎస్‌ఓల్లో మాత్రమే ఆధార్ సెంటర్లు వినియోగింలో ఉన్నాయి. గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, పామిడి, కణేకల్లు, తాడిపత్రి, ఉరవకొండ,, ఎస్‌వీపురంలో తపాలా ఆధార్ సెంటర్లు తాత్కాలికంగా మూతవేశారు. వీటిలో ప్రధానంగా కళ్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు, ఉరవకొండ ప్రాంతాల్లో గిరిజన ప్రజలు ఎక్కువగా ఉండటంతో అక్కడ సెంటర్లు ఏర్పాటు చేశారు. అవి పనిచేయకపోవడంతో గిరిజన ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అన్నీ సమస్యలే..

తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్లకు నిత్యం ఏదో ఒక సమస్య పట్టి పీడిస్తోందనే చెప్పాలి. సర్వర్ సమస్య గురించి చెప్పక్కర్లేదు. ఏ సెంటర్‌లో చూసినా ఈ సమస్య సర్వసాధారణం అయిందనే చెప్పాలి. మిగిలిన చోట్ల టెక్నికల్, సిస్టం సమస్యలతో సెంటర్లు దాదాపు మూతదశకు చేరుకున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఆయా హెచ్‌ఓ, ఎస్‌ఓల్లో అధికారులు వాటి గురించి పట్టించుకోకపోవడంతో సమస్య తలెత్తుతోందనే చెప్పాలి. సమస్యను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు తెలియజేయాల్సిన ఆయా పోస్టాఫీసుల్లోని సిబ్బంది చేరవేయకపోవడమే ఆధార్ సెంటర్లు మూతపడటానికి ప్రధాన కారణమనడంలో సందేహం లేదు.

అన్ని కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం



జిల్లాలో తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్లలో కొన్ని పనిచేయని విషయం వాస్తవమే. ఇప్పటికే ఎక్కడెక్కడ పనిచేయడం లేదో.. ఆయా సెంటర్ల వివరాలను సేకరించాం. వాటికి సంబంధించి ఇప్పటికే టెక్నీషియన్లతో సమస్యను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. డిసెంబరు నాటికి జిల్లాలోని అన్ని తపాలా శాఖల్లోని ఆధార్ సెంటర్లను వినియోగంలోకి తెస్తాం... ప్రజలకు అసౌకర్యం కలగకుండా సేవలు అందిస్తాం. - **అమర్‌నాథ్, సూపరింటెండెంట్**

క్రైం కార్నర్

కళ్లెదుటే వృద్ధురాలు సజీవ దహనం

- షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసెకు మంటలు
- నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం



గంగమ్మ (ఫైల్)

బెళుగుప్ప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కన్నతల్లి కళ్లెదుటే మంటల్లో సజీవ దహనం అవుతుంటే.. కాపాడు కోలేక దీనస్థితిలో కొడుకు, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో భర్త తల్లడిల్లిపోయారు. మండలంలోని గంగవరంలో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమయింది. గ్రామ స్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ స మీపంలో వ్యవసాయ తోటలో రెండు పూరిగుడిసెలు నిర్మించుకుని నరసన్న, గంగమ్మ కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. ఒక గుడిసెలో గంగమ్మ(60) నిద్రిస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. అనారోగ్యంతో బాధపడుతూ కళ్లు సరిగా కనిపించకపోవడంతో మంటల నుంచి బయటకు రాలేక చిక్కుకుని గుడిసెలో కాలి మృతి చెందింది. ఎద్దులబండి టైర్లు ఉండటంతో మంటలకు కాలి పెద్ద శబ్దమొచ్చింది. శబ్దం విని బయటికి రాగానే పెద్దఎత్తున మంటల్లో గుడిసె దగ్ధమవుతుండగా భర్త నరసన్న, కుమారుడు యర్రిస్వామి బయటి నుంచి చూస్తూ అరవడం మినహా ఏమీ చేయలేకపోయారు.

వ్యక్తి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం



హత్యకు గురైన చలపతి (ఫైల్)



నిందితుడు వెంకటరమణ

నల్లచెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన చలపతి (37) మంగళవారం హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు కుమ్మరవాండ్లపల్లికి చెందిన చలపతి భవన నిర్మాణ పనులు చేసుకుంటూ తన భార్య ఇద్దరు పిల్లలను పోషించుకునేవాడు. ఈయన గత 8 ఏళ్లుగా పక్క గ్రామానికి చెందిన వెంకటరమణ భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. ఈ విషయంపై వెంకటరమణ ఎన్నోసార్లు తన భార్యకు బుద్ధి చెప్పాలని చూశాడు. అయినా ఆమె మాట వినకుండా గొడవ పడి మూడేళ్ల కిందట అయన్నగారి కొత్తపల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. అయినా చలపతి ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. దీన్ని అవమానంగా భావించిన వెంకటరమణ ఎలాగైనా చలపతిని అంతమొందించాలనుకున్నాడు. ఈక్రమంలో ఓరువాయి గ్రామంలోని ఎల్లమ్మ గుడి సమీపంలో చలపతి భవన నిర్మాణ పనులు చేస్తున్నాడని వెంకటరమణ తెలుసుకున్నాడు. ఉదయం 9 గంటల సమయంలో పని విరామ సమయంలో భోజనం చేస్తుండగా వెనుక నుంచి వెళ్లి మెడపై కొడవలితో నరికాడు. దీంతో చలపతి అక్కడికక్కడే మృతి చెందాడు. భవన నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ నాగేంద్ర, ఎస్సై మక్బుల్ బాషాలు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్టు



దొంగ నోట్ల ముఠాను అరెస్టు చూపుతున్న పోలీసులు

బత్తలపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నకిలీ నోట్లను చలామణి చేసే ముఠాను అరెస్టు చేసినట్టు సీఐ ప్రభాకర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్ఐ సోమశేఖర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నకిలీనోట్లను విక్రయిస్తున్న కడప జిల్లా తాళ్లప్రొద్దుటూరుకు చెందిన బొడేపల్లి అంజి, ఓబులేసు, తాడిపత్రి మండలం బోడాయిపల్లికి చెందిన రాజకుళ్లాయప్పను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. బొడేపల్లి అంజి, అతడి మిత్రుడు చామలూరు ఓబులేసుకు నకిలీ నోట్ల గురించి చెప్పాడు. రూ.లక్ష నగదు ఇస్తే.. మూడు లక్షల విలువైన నకిలీ నోట్లు ఇస్తారని తెలిపాడు. ఓబులేసు రాజకుళ్లాయప్ప ద్వారా కమలాపురం గ్రామానికి చెందిన వీరాంజనేయరెడ్డితో మాట్లాడుకున్నారు. ఆ మేరకు గత నెల 18న మండలంలోని సంజీవపురం ఆర్చ్ వద్ద నకిలీ నోట్లను వీరాంజనేయరెడ్డికి చూపించారు. సమ్మతించిన వీరాంజనేయరెడ్డి 19న మరోసారి సంజీవపురం వద్దకు వచ్చాడు. ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన బాలు, హరి ద్వారా అసలైన నోట్లు రూ.3లక్షలు ఇచ్చి.. నకిలీ నోట్లు రూ.9లక్షలు తీసుకొని వెళ్లిపోయారు. వారు ఇచ్చిన నకిలీ నోట్లు సరైనవి కావని గుర్తించిన వీరాంజనేయరెడ్డి అంజి, ఓబులేసుతో డబ్బు విషయమై మాట్లాడాలని వెంకటగారిపల్లి క్రాస్ వద్దకు రమ్మన్నారు. దొంగ నోట్ల ముఠా సోమవారం రాత్రి గొడవ పడుతుండగా పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దొంగనోట్ల ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.


20 మంది జూదరుల అరెస్టు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం రూరల్ పోలీసులు, అనంతపురం స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 20 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18,92,040 నగదు, ఒక కారు, 24 సెల్ ఫోన్లు, 17 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ రాఘవేంద్రప్ప తదితరలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి జరిమానా

గుత్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ ద్విచక్ర వాహనానికి పోలీసులు జరిమానా విధించారు. గుత్తి పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో సీఐ రామారావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. ఈనేపథ్యంలో టీడీపీ మాజీ ఎంపీపీ వీరభద్రయ్య తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బైక్‌ను నిలిపారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా వెళ్తుండడంతో రూ.1050 జరిమానా విధించారు. జరిమానా చెల్లించి వాహనాన్ని తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. తాను ఆన్‌లైన్‌లో చెల్లిస్తానని ఆయన తెలిపాడు. వాహనాన్ని అక్కడే వదిలి ఆటోలో వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు ద్విచక్రవాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై సీఐను వివరణ కోరగా.. తాము నిబంధనల మేరకు జరిమానా విధించామని తెలిపారు.

టమోటా కిలో రూ.27



అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో మంగళవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.27తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1575 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

చీనీ టన్ను రూ.19వేలు



అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 42టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చౌకబారు రంగయ్యా.. నీ ఆటలు సాగవ్..!

- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు
- టీడీపీ తీర్థం పుచ్చుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్
- రంగయ్య తీరుతోనే టీడీపీలో చేరా

:జయం ఫణీంద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

అనంతపురం క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు తలారి రంగయ్య చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని, బురద చల్లి గొప్పవాడు కావాలని చూస్తున్నాడని, ఆయన ఆటలు ఇక సాగవని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చురకలంటించారు. రాజకీయ ఉనికి కోసమే ఆయన తనపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం అనంతపురంలోని తన నివాసంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనంద్ మృతి బాధాకరం అన్నారు. అగ్రవర్ణాలు చంపాయంటూ రంగయ్య ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ఆధారాలు ఉంటే చూపాలని నిలదీశారు. పోలీసులు ఇచ్చిన నోటీసులు తీసుకోకుండా తిరుగుతున్నారని అన్నారు. బురద చల్లితే గొప్పవాడివి కాలేవని హితవు పలికారు. న్యాయం తెలుగుదేశం వైపే ఉంటుందని, ప్రజలకు మంచి చేయాలనే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. రంగయ్య వద్ద ఏవైనా ఆధారాలు ఉంటే.. రుజువు చేయాలని సవాల్ విసిరారు. ఆయన రాజకీయ చేష్టలు చూసి విసుగెత్తే... కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర టీడీపీలో చేరారని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర మాట్లాడుతూ.. మాజీ ఎంపీ రంగయ్య వైఖరి వల్లే తాను వైసీపీ వీడినట్టు తెలిపారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి చూసి, సహకరించాలని టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్టు ఆయన వివరించారు.



టీడీపీలో చేరుతున్న కళ్యాణదుర్గం వైస్ చైర్మన్

వైసీపీకి భారీ షాక్

- పార్టీకి మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీనామా.. టీడీపీలో చేరిక
- టీడీపీ వశంకానున్న కళ్యాణదుర్గం మున్సిపల్ పీఠం

కళ్యాణదుర్గం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీకి భారీ షాక్ తగిలింది. కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ పీఠం టీడీపీ కైవసం కాబోతోంది. మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర అనూహ్యంగా వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించారు. దీంతో టీడీపీకి సం ఖ్యాబలం పెరిగింది. జయం ఫణీంద్ర వైసీపీకి రాజీనా మా చేసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యం లో మంగళవారం టీడీపీలో చేరారు. ఈ నెల 11న మున్సిపల్ చైర్మన్ ఎన్నికను నిర్వహిస్తున్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 13 మంది వైసీపీ వర్గీయులు, 11 మంది టీడీపీ వర్గీయులు ఉన్నారు. ఎక్స్ అఫిషియో హోదాలో ఎ మ్మెల్యే, ఎంపీకి ఓటు వేసే హక్కు ఉంది. దీంతో పాటు తాజాగా వైసీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర టీడీపీలోకి చేరారు. దీంతో టీడీపీ సంఖ్యా బలం 14 కు చేరింది. ఇక గెలుపు తథ్యం కాబోతోందన టీడీపీ వర్గీయులు ధీమాతో ఉన్నారు.

ఇంటర్ విద్యార్థిని ప్రసవం

అనంతపురం వైద్యం, కళ్యాణదుర్గం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి ప్రాంతానికి చెందిన ఇంటర్ విద్యార్థిని కళ్యాణదుర్గంలో ప్రసవించింది. ఈ విషయం ఐసీడీఎస్ అధికారులకు తెలియడంతో చైల్డ్‌లైన్‌కు వివరాలను తెలియజేశారు. ఓ జూనియర్ కళాశాలలో చదువుతున్న బాలిక, అదే ప్రాంతానికి చెందిన బాలుడి కారణంగా గర్భం దాల్చింది. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు కళ్యాణదుర్గం ప్రాంతంలోని తమ బంధువుల ఇంటికి బాలికను పంపారు. బాలికను, శిశువును, కుటుంబ సభ్యులను అధికారులు సఖి కేంద్రానికి తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కేసు నమోదు చేయాలని తాడిపత్రి పోలీసులకు సిఫార్సు చేశారు.

సైబర్ నేరగాళ్ల బారిన ప్రైవేట్ ఉద్యోగి

- రూ.80వేలు మాయం

సోమందేపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి మొబైల్‌లోని వాట్సప్‌కు మెసేజ్ వచ్చింది. మెసేజ్‌ను చదివిన అతను గుర్తుతెలియని వ్యక్తులతో చాటింగ్ చేశాడు. అనంతరం వారు పంపిన లింక్‌ను క్లిక్ చేయడంతో తన ఖాతా నుంచి రూ.80వేలు మాయమైనట్లు గ్రహించాడు. డబ్బులు కట్‌అయినట్లు మెసేజ్ రావడంతో ఉలిక్కిపడ్డాడు. బ్యాంక్ మినీ స్టేట్‌మెంట్ చెక్‌చేయగా సైబర్ నేరగాళ్ల నగదును తమ ఖాతాలోకి బదిలీ చేసుకున్నట్లు గ్రహించి లబోదిబోమన్నాడు. తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు తెలుపగా పుట్టపర్తిలోని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని తెలిపారు. విషయం తెలిస్తే పరువు పోతుందని భావించి వివరాలు వెల్లడించలేదని వాపోయాడు.

డిగ్రీలో ఇద్దరు డీబార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ 3, 5వ సెమిస్టర్‌లో పరీక్షల్లో ఇద్దరిని డీబార్ చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గుత్తిలోని ఎంఎస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, హిందూపురంలోని బాలాజీ విద్యామందిర్‌లో ఒకరు కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డీబార్ చేసినట్లు ఆయన తెలిపారు.

22 నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలోని పీజీ 3వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతున్నట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్కేయూతో పాటు అనుబంధ కళాశాలలైన నగరంలోని శ్రీవాణి, పీవీకేకే, హిందూపురంలోని కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు.

బి.ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో నవంబరులో నిర్వహించిన బి.ఫార్మసీ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పరీక్షల విభాగంలో వీసీ ఆచార్య సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య ఆదేశాల మేరకు బి.ఫార్మసీ నాల్గవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్(ఆర్19) రెగ్యులర్, సప్లిమెంటరీ, నాల్గవ సంవత్సరం ఒకటో సెమిస్టర్(ఆర్15) సప్లమెంటరీ, నాల్గో సంవత్సరం రెండో సెమిస్టర్(ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని పేర్కొన్నారు. పరీక్షా ఫలితాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం కంట్రోలర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ శంకరశేఖర్ రాజు. శ్రీధర్, అంకారావు పాల్గొన్నారు.

నేడు న్యాయశాస్త్ర విభాగంలో సదస్సు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలోని న్యాయశాస్త్ర విభాగంలో 'రాజ్యాంగాన్ని అర్థం చేసుకుందాం - కాపాడుకుందాం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు జేవీవీ నాయకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, మానవ హక్కుల వేదిక నాయకుడు చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

శిశుగృహలో ఉద్యోగావకాశాలు

అనంతపురం వైద్యం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహలో ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి తెలిపారు. శిశుమరణంతో ఇటీవల శిశుగృహలోని సిబ్బందిని తొలగించామని, కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు ఖాళీ పోస్టులను కాంట్రాక్ట్, పార్ట్‌టైం ప్రాతిపదికన భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఈ నెల 13, 14వ తేదీలు సెలవు రోజులైనా దరఖాస్తులను తీసుకుంటామని తెలిపారు. ఐసీడీఎస్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను ఇవ్వవచ్చునని తెలిపారు.

రెండోరోజూ అంతే..!

- పీజీ స్పాట్ అడ్మిషన్లకు 20 మంది హాజరు
- నేడూ అడ్మిషన్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో నిర్వహిస్తున్న పీజీ మిగులు సీట్ల స్పాట్ అడ్మిషన్లకు రెండోరోజు స్పందన కరువయింది. మంగళవారం ఉదయం 10 గంటలకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారు. సాయంత్రంలో ముగిసేలోపు 20 మంది మాత్రమే అడ్మిషన్లు పొందారు. రెండ్రోజుల పాటు జరిగిన అడ్మిషన్ల ప్రక్రియలో 29 విభాగాలలో ఖాళీగా ఉన్న 808 సీట్లకు మొత్తం 128 మంది అడ్మిషన్లు పొందినట్లు అధికారులు తెలిపారు. వీరిలో ఎంత మంది ఫీజులు చెల్లించారన్న దానిపై స్పష్టత కొరవడింది. ఈ నేపథ్యంలోనే అడ్మిషన్ పొందిన విద్యార్థుల సంఖ్యను అధికారికంగా అధికారులు నిర్ధారించలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీనిపై అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ నరసింహన్‌ను వివరణ కోరగా... ఎంత మంది కట్టారన్నది ఇప్పుడే చెప్పలేమని, ప్రక్రియ ముగిసిన తరువాత ప్రకటిస్తామని చెప్పుకొచ్చారు. అడ్మిషన్ల ప్రక్రియ బుధవారం కూడా కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు.

రేపటి నుంచి ఆహార కమిషన్ సభ్యురాలి పర్యటన

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి జిల్లాలో ఈ నెల 11, 12 తేదీల్లో పర్యటించనున్నారని కలెక్టర్ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆహార భద్రతా చట్టం - 2013 అమలును పర్యవేక్షించడం, సమీక్షించడం కోసం ఏపీ రాష్ట్ర ఆహార కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలో జాతీయ ఆహార భద్రతా చట్టం అమలులో భాగంగా పీడీఎస్, ఎండీఎం, ఐసీడీఎస్, పీఎంఎంవీవై, ఇతర సంక్షేమ పథకాల అమలును తనిఖీ చేయడానికి, క్షేత్ర పర్యటన కోసం ఆమె జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

నరసింహస్వామి హుండీ ఆదాయం రూ.21.64 లక్షలు



ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

మడకశిర రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి హుండీలను మంగళవారం లెక్కించినట్లు ఈఓ నరసింహరాజు తెలిపారు. రెండు దేవాలయాల నుంచి రూ.21.64 లక్షలు హుండీ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అందులో భక్తరహళ్లి నరసంహస్వా మి హుండీ ఆదాయం రూ.13.60 లక్షలు, జిల్లేడగుంట ఆంజనేయ స్వామి హుండీ ఆదాయం రూ.8.32 లక్షలు వచ్చినట్లు తెలిపారు.

నేటి నుంచి 21 వరకు టెట్

- 7 కేంద్రాలు.. 17,100 మంది అభ్యర్థులు
- నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి: డీఈఓ

అనంతపురం విద్య, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ రాసే అభ్యర్థులతో పాటు ఈసారి ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష నిర్వహిస్తున్నారు. బుధవారం నుంచి టెట్ పరీక్షలు మొదలవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబు వెల్లడించారు. టెట్ పరీక్షలు బుధవారం ప్రారంభమై.. ఈనెల 21వరకు కొనసాగుతాయ తెలిపారు. జిల్లాలో టెట్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. ఇందులో అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కాలేజ్, ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కాలేజ్, ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కాలేజ్, తాడిపత్రి సీవీరామన్ ఇంజినీరింగ్ కాలేజ్, తాడిపత్రి ఇంజినీరింగ్ కాలేజ్, గుత్తి గేట్స్ కాలేజ్‌తో పాటు అనంతపురం చిన్మయనగర్‌లోని నేషనల్ కౌన్సిల్ ట్రైనింగ్ సెంటర్‌లో పరీక్షలు ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలో 17,100 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు కొనసాగుతాయని వెల్లడించారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

80 పోస్టులు.. 584 దరఖాస్తులు

- అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు భారీ పోటీ
- ఎంపిక ప్రక్రియలో జాప్యం

అనంతపురం విద్య, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వేతనం తక్కువే అయినా, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. సబ్జెక్టు టీచర్‌లు లేని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యామ్నాయంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లును (వలంటీర్లు) నియమించుకోవాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశించిన విషయం తెలిసిందే. జిల్లాలో 80 ఖాళీలు ఉండగా, 584 దరఖాస్తులు వచ్చాయి. స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టులు 60, ఎస్‌జీటీ క్యాడర్‌లో 20 ఖాళీలు ఉన్నాయి. ఎస్‌జీటీలకు రూ.10 వేలు, స్కూల్ అసిస్టెంట్‌కు రూ.12500 వేతనం ఇస్తారు. సమగ్ర శిక్ష ద్వారా ఈ విద్యా సంవత్సరానికి వేతనం ఇస్తామని ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు ఎంఈఓలకు అభ్యర్థులు దరఖాస్తులను అందజేశారు. ఎంపిక ప్రక్రియను 8వ తేదీకల్లా పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నా, భారీగా దరఖాస్తులు రావడంతో ఇంకా పూర్తి కాలేదు.

ఎస్‌జీటీలకు భారీ పోటీ: జిల్లాలో 80 పోస్టులకు 584 దరఖాస్తులు అందాయని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 9 బయాలజీ పోస్టులకు 45 మంది, 4 ఇంగ్లిష్ పోస్టులకు 26 మంది, 19 హిందీ పోస్టులకు 49 మంది, 2 ఫిజికల్ సైన్స్ పోస్టులకు ఇద్దరు, 6 గణితం పోస్టులకు 38 మంది, 3 సోసియల్ పోస్టులకు 43 మంది, 9 తెలుగు పోస్టులకు 39 మంది, 5 సోషియల్ ఉర్దూ పోస్టులకు 14 మంది దరఖాస్తు చేశారు. ఎస్‌జీటీ పోస్టులు 20 ఉండగా, ఏకంగా 316 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. దరఖాస్తుల పరిశీలనకు కొంత మంది ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో కమిటీ వేశారు. కమిటీ సభ్యులు మంగళవారం డీఈఓ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలించి, మెరిట్ పాయింట్స్ కేటాయించారు. ఉన్నతాధికారులు పరిశీలించిన తర్వాత నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి, జాబితాను కలెక్టరుకు పంపుతామని డీఈఓ తెలిపారు. కలెక్టర్ ఆమోదం పడిన తర్వాత అభ్యర్థులకు సమాచారం పంపుతామని అన్నారు.

రాయల జయంతి ఉత్సవాలు నిర్వహించాలి : మంత్రి



టూరిజం శాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని పర్యాటకశాఖ అధికారులకు మంత్రి సవిత సూచించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెనుకొండ, పుట్టపర్తి ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో బోటింగ్, టూరిజం గెస్ట్‌హౌస్ నిర్మాణాలపై దృష్టిసారించాలన్నారు. పెనుకొండ కొండకు రోడ్డు పూర్తికావడంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. ఈ క్రమంలో కొండపై కూడా గెస్ట్‌హౌస్ నిర్మించాలని పేర్కొన్నారు. కుంభకర్ణ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని తెలిపారు.

నేడు డిప్యూటీ సీఎంతో మాటామంతీ

- జిల్లా నుంచి వెళ్లిన అధికారులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఉద్యోగులతో డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ బుధవారం భేటీ కానున్నారు. అందుకు సంబంధించి మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలు వేదిక కానుంది. ఈ మేరకు జిల్లా నుంచి పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఏఓలు, ఎంపీడీఓలు, నూతనంగా పదోన్నతి పొందిన వారి జాబితా తయారు చేయించి మాటా - మంతీ కార్యక్రమంలో హాజరయ్యేలా జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈవో వెంకటసుబ్బయ్య చర్యలు చేపట్టారు. ఈమేరకు ఆర్టీసీ నుంచి రెండు బస్సులు ఏర్పాటు చేసి సిబ్బంది వెళ్లడానికి ఏర్పాట్లు చేశారు. మంగళవారం డీపీఓ నాగరాజనాయుడుతో పాటు 22 మంది తరలి వెళ్లారు.

చిత్తూరు డీఈఓగా బుక్కపట్నం డైట్ లెక్చరర్



రాజేంద్రప్రసాద్

కొత్తచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్ కె.రాజేంద్రప్రసాద్ చిత్తూరు డీఈఓగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు సీనియర్ అధ్యాపకులు, ఉద్యోగులకు విద్యాశాఖ ఉద్యోగోన్నతులను కల్పించింది. అందులో భాగంగా రాజేంద్రప్రసాద్‌ను ఉద్యోగోన్నతిపై చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమించారు.

గైబువల్లికి సలహాదారు పదవి



అనంతపురం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహకార మంత్రిత్వ శాఖకు హిందీ సలహాదారుడిగా హిందీసేవాసదన్ వ్యవస్థాపకుడు, హైదరాబాద్ హిందీ ప్రచార సభ ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక హిందీసేవా సదన్ కార్యాలయంలో గైబువల్లి మీడియాతో మాట్లాడారు. తన 18వ ఏట నుంచే హిందీ భాషా ప్రచారంలో విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. హిందీ భాషాభివృద్ధికి తెలుగు రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి పదవి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హిందీ భాషాభివృద్ధికి మరింత ఉత్సాహంతో పని చేస్తానన్నారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖకు హిందీ సలహాదారుడిగా నియమితులైన గైబువల్లికి పలువురు హిందీ పండితులు శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్ బాక్స్

ప్రాథమి ఆరోగ్య కేంద్రం తనిఖీ

అమడగూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి ఓబుళు మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ప్రధాన మంత్రి సురక్ష, మాతృత్వ అభియాన్ కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటున్నా, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రంలోని ల్యాబరేటరీ రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం విస్తరిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల సిబ్బంది అవగాహన కలిగి, ప్రజలకు సరైన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారులు గిరిధర్‌రెడ్డి, లక్ష్మీనాయక్, దేవాలానాయక్, డాక్టర్ అపర్ణ, సూపర్‌వైజర్లు శశిధర్, ఫక్రుద్దీన్, నాగమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వయోజన విద్యా వలంటీర్లకు శిక్షణ



వలంటీర్లకు వయోజన విద్య పుస్తకాలు అందిస్తున్న ఏంఈఓ

అమడగూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అమృత మండల సమాఖ్య సమావేశ భవనంలో మండల విద్యాధికారి జిలాన్ భాషా ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర వయోజన విద్య వలంటీర్ టీచర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ... మండల వ్యాప్తంగా ఈ ఏడాది 1907 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు తెలిపారు. కేంద్రాల నిర్వహణ, వయోజనులకు బోధించే పద్ధతులపై వలంటీర్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వలంటీర్లకు అక్షర ఆంధ్ర వాచకాలు, సాధన పత్రాలు పంపిణీ చేశారు. వయోజన విద్య పర్య వేక్షకులు మధుసూదన్, సీడీపీఓ గాయత్రి, గంగాదేవి, ఏపీఓ మధుసూదన్‌రెడ్డి, ఏపీఎం భారతి, మహిళా మండలి సభ్యురాళ్లు మునిరత్నమ్మ, వేమలమ్మ, సీసీలు, అకౌంటెంట్, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● నల్లమాడ: మండలకేంద్రంలోని మండల సమాఖ్య సమావేశ భవనంలో ఎంఈఓ సురేష్ ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర వలంటీర్ ఉపాధ్యా యులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ... ఈ సంవత్సరం 1,907మంది నిరక్షరాస్యులను గుర్తించామని తెలిపారు. ఉత్తీర్ణులైనవారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ది, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. వయోజన విద్య పర్యవేక్షకులు సుధాకర్, ఏపీఎం గోపాల్, ఎంపీఓ రఘునాథ్‌రెడ్డి, ఆనిమేటర్లు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

అమడగూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రెడ్డివారిపల్లిలో మంగళవారం రాష్ట్రీయ గోకుల మిషన్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు వెంకటేష్ హాజరై మాట్లాడుతూ... పశువుల్లో లింగనిర్ధారణ వీర్యం, ఎన్ఆర్ఈజీ ఎస్ ద్వారా పశుగ్రాస సాగు విస్తరణపై రైతులకు వివరించారు. పశువులకు ఉచితంగా ఆరోగ్య చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు కేవశయ్య, రవినాయక్, సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

పట్ట పగలే ఇంట్లో చోరీ

● 9 తులాల బంగారం, రూ. 5లక్షలు నగదు...

ధర్మవరం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతులనాగేపల్లిలో బండి పెద్ద నరసింహులు ఇంట్లో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. బాధిత కుటుంబం తన వరి పొలంలో పనులు చేసుకునేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి, ఇంటి తలుపులు తెరిచి ఉండటం కనిపించింది. లోపలికి వెళ్లగా బీరువా తెరిచి ఉంది. అందులోని బంగారు, నగదు చోరీకి గురైనట్లు గుర్తించామని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. బీరువాలో ఉన్న తొమ్మిది తులాల బంగారం, రూ. 5లక్షల నగదు చోరీకి గురైందని వారు డయల్100కు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు.

ఎస్కేయూ జట్టుకు మంగళకర విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో కరస్పాండెంట్ సురేష్‌కుమార్

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి వాలీబాల్‌పోటీల్లో ఉత్తమప్రతిభ కనపరిచిన తమ కళాశాల విద్యార్థినులు ఎస్కే యూనివర్శిటీ వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు మంగళకర ఎడ్యుకేషనల్ మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. తమ కళాశాలలో బీఎస్సీ ప్రథమసంవత్సరం చదువుతున్న నందిని, సాయిసునీతు ఈ నెల 7న అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి ఎస్కేయూ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 15న జరగనున్న సౌత్‌జోన్‌ఇంటర్ యూనివర్శిటీ ఉమెన్ వాలీబాల్ పోటీల్లో ఎస్కేయూ తరుపున వీరు ఆడనున్నారన్నారు. ఆ విద్యార్థినులను మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యాప్రకాశ్, ఏఓ జయచంద్రారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

టీడీపీ నాయకుడి మృతి

● ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, మాజీ మంత్రి నివాళి



అన్నం లక్ష్మీనారాయణ (ఫైల్)

నల్లమాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎర్రవంకపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు అన్నం లక్ష్మీనారాయణ(63) మంగళవారం మృతిచెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఎర్రవంకపల్లికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియారు. వారితోపాటు టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మైలే శివశంకర్, సింగల్‌విండో అధ్యక్షుడు గడ్డం రమణారెడ్డి, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, దేశాయి మంజునాథ్‌రెడ్డి, కొక్కంటి మంజునాథ్‌రెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, ప్రసాద్‌రెడ్డి, గందోడి శ్రీరాములు, లక్ష్మణ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ఆస్తులున్నా.. హారతులేవీ..?

● 20 ఎకరాల మాన్యం ఉన్నా.. పూజలు కరువు
● శిథిలావస్థలో కురుమాల చెన్నకేశవస్వామి ఆలయం



కురుమాల చెన్నకేశవస్వామి ఆలయం

నల్లమాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు దూప, దీప, నైవేద్యాలతో కలకలలాడిన ఆలయం నేడు పూజలు కరువై వెలవెలబో తోంది. కొంతమంది దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టడంతో ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. నల్లమాడ మండలం కురమాల గ్రామ సమీపంలోని చెన్నకేశవస్వామి ఆలయం నిరాదరణకు గురవుతోంది. గతంలో ఆలయం నిత్యం భక్తులతో కలకలాడుతుండేది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఆలయ నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతోంది. శైవులు, వైష్ణవుల మధ్య యుద్ధాల నివారణ కోసం శ్రీకృష్ణ దేవరాయలు అప్పట్లో చెన్నకేశవస్వామి ఆలయం నిర్మించినట్లు తెలు స్తోంది. ఈ ఆలయానికి 20 ఎకరాల మాన్యం ఉంది. అయినా ఎలాంటి పూజలు లేవు. కురమాలకు చెందిన తలసాని కేశవరెడ్డి గతంలో రెవె న్యూ అధికారులను సంప్రదించి మాన్యం భూమిలో చింత- నిశ్చింత పథకం ద్వారా చింత మొక్కలు నాటించారు. అప్పటి తహసీల్దార్ వెంకటేశం చింతమొక్కల పెంపకానికి ప్రాధాన్యమిచ్చారు. గుప్త నిధుల కోసం ఆలయ పరిసరాలను దుండగులు తవ్వేశారు. గర్భగుడిలో విగ్రహాన్ని సైతం తొలగించారు. కొద్దిరోజుల క్రితం గ్రామస్థులు ఆలయంలో చెన్నకేశవస్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. ఇక్కడే దేవరగుడి అనే గ్రామం ఉండేది. ఈ గ్రామం కాలగర్భంలో కలిసిపోయింది. ఆ గ్రామానికి సమీపంలో దాతలు 30 అంకణాల సత్రం నిర్మించి, బావిని తవ్వించారు. ఆలయంలో భక్తుల విడిదికి, వండుకోవడానికి వీటిని ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఆలయం వద్ద బావి ఉంది. సత్రాలు శిథిలావస్థకు చేరాయి. ఆలయంలో దూపదీప నైవేద్యాలు కనుమరుగయ్యాయి. ఆలయంలో గతంలో వివాహాలు అధికంగా జరిగేవి. ఇప్పటి కైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని ఆలయం అభివృద్ధికి కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.



మాన్యం భూముల్లో పెంచిన చింతచెట్లు

పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలి

● రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి
● ముదిగుబ్బ కేజీబీవీ తనిఖీ



కేజీబీవీలో గర్భిణులకు సీమంతం చేస్తున్న గంజిమాల దేవి

ముదిగుబ్బ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర ఆహర కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి సూచించారు. ఆమె మంగళవారం ముదిగుబ్బ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)ని తనిఖీ చేశారు. పాఠశాలలో నిత్యావసర వస్తువులను, ఆహార తయారీని, విద్యార్థులకు అందుతున్న మౌళిక వసతులను, వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, ప్రీస్కూల్ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రభుత్వ నిర్దేశిత ప్రమాణాల మేరకు అమలు చేయాలని సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన శుభ్రమైన పౌష్టికాహారం అందించాలని, లేకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమాల దేవి మంగళవారం మండలంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ పాఠశాల, పట్టణంలోని బీసీ కళాశాల హాస్టళ్లను తనిఖీచేశారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై ఆమె విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతపై ఆరా తీశారు. హాస్టళ్లలో మెనూ ఖచ్చితంగా పాటించాలని వార్డెన్లను ఆదేశించారు.

ఎంఎస్ఎల్ పాయింట్ తనిఖీ

● ధర్మవరం: మార్కెట్ యార్డులో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను మంగళవారం రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి తనిఖీ చేశారు. చౌకదుకాణాలకు పంపిణీ చేసే బియ్యం, చక్కెర, తదితర సరుకుల నిల్వలను, స్టాకు నిల్వ రికార్డులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో స్టాక్ పాయింట్ అధికారి ప్రసన్నకుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్ల సమస్యకు పరిష్కారం

● పరిటాల శ్రీరామ్ చొరవతో ఇరువర్గాల రాజీ



దళితులకు పట్టాలు పంపిణీ చేసిన పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొడరాళ్లపల్లి లో దాదాపు 50 ఏళ్లుగా భూమి కోసం జరుగుతున్న వివాదానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ శాశ్వత పరిష్కారం చూ పారు. ముదిగుబ్బ మండలం పొడరాళ్లపల్లిలో కొందరు దళితులు 51 సెంట్లలో గుడిసెలు వేసుకున్నారు. దీనిపై సుమారు 50 ఏళ్లుగా వివాదం నడుస్తోంది. ఇరు పక్షాల వారు కోర్టుకు వెళ్లినా పరిష్కారం కాలేదు. ఈ విషయాన్ని దళితులు శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఇరుపక్షాలతో సుదీర్ఘంగా చర్చించి.. రాజీ కుదిర్చారు. భూ యజమానులకు 20 సెంట్లు, మిగిలిన 31 సెంట్లలో రోడ్లు, డ్రైనేజీలకు 10 సెంట్లు పోనూ మిగిలిన 21 సెంట్లలో 14 మం ది దళితులకు ఇంటి పట్టాలు అందజేశారు. ఆయన మంగళవారం అనంతపురంలోని తన నివాసంలో వారికి ఇంటి పట్టాలు అందజేశారు. సమస్యకు పరిష్కారం చూపడంతో ఇటు దళితులు, యజమానులు శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై కోర్టులకు వెళ్లి, ఏళ్ల తరబడి ఇబ్బందులు పడవద్దని, రాజీ మార్గంలో పరిష్కరించుకుంటే ఇరువురికి మేలు జరుగుతుందని పరిటాల శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, నాయకులు కోట్ల బాబి, చంద్రబాబు, సునీల్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖాధికారుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం

నల్లచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశానికి విద్యుత్ శాఖ అధికారులు హాజరుకాకపోవడం పట్ల ఎంపీపీ రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీ రమణారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. అయితే మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై సమావేశంలో సర్పంచ్‌లు అడగగా... వివరణ ఇచ్చేందుకు విద్యుత్ అధికారులు ఎవరూ హాజరుకాకపోవడంతో ఎంపీపీ విద్యుత్ శాఖ డీఈని ఫోన్‌లో సంప్రదించారు. ఆయన పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు గైర్హాజరైన విద్యుత్ శాఖ అధికారులకు నోటీసులు జారీ చేయమని ఉన్నతాధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కమీషన్ రూ.200కు పెంచాలి

● ఆహార కమిషన్ సభ్యురాలికి రేషన్ డీలర్ల వినతి

ధర్మవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు ఇస్తున్న కమీషన్ రూ.100 నుంచి రూ.200కు పెంచాలని మండలంలోని చౌక డిపో డీలర్లు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవికి వినతిపత్రం అందజేశారు. ధర్మవరానికి మంగళవారం వచ్చిన ఆమెను డీలర్లు కలిసి తమ సమస్యలపై విన్నవించారు. మండలంలో 117 ప్రభుత్వ చౌక డిపోలు ఉన్నాయని, నియమనిబంధనలు అనుసరించి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నామని తెలిపారు. క్రెడిట్ ఆర్ఓ ద్వారా పంచదార, కందిబేడలు, ఇతర నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు. . ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకు తాము సొంత డబ్బులతో వెళ్లి పంపిణీ చేస్తున్నామన్నారు. గతంలో ఎండీయూ వాహనాల సహాయకుడికి రూ.5వేలు వేతనం ఇచ్చిన విధంగా ప్రస్తుతం డీలర్లకు గౌరవవేతనంతో సబంధంలేకుండా కనీసం రూ.5వేలు ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆమెను కోరారు. కమిషన్ సభ్యురాలిని కలిసిన వారిలో డీలర్లు అనిల్, అనందరెడ్డి తదితరులు ఉన్నారు.

గొర్రెలు, మేకల పెంపకంపై అవగాహన



హాజరైన వివిధ శాఖల అధికారులు

గాండ్లపెంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల పెంపకం పలువురికి జీవనోపాధి కల్పిస్తోందని పశుసంవర్ధక శాఖ జేడి శుభదాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో పొదుపు సంఘం సభ్యులకు, యానిమేటర్లకు పశువులు, గొర్రెలు, మేకలు యాజమాన్యం, వాటి పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజవాణి చారిటబుల్ ట్రస్ట్, డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రాజెక్ట్ డైరెక్టర్ కేఎస్ నరసయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ శుభదాస్, టాటా ట్రస్ట్ ప్రతినిధులు రామచంద్రుడు, శంకర్‌నాయక్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ... పశువులు, గొర్రెలు, మేకలు పెం పకానికి యజమానులు మేలైన జాతిని ఎంపిక చేసుకుంటే లాభసాటిగా ఉంటుందన్నారు. వాటి పోషణ, సంరక్షణపై జాగ్రత్తలు, సూచనలు తీసుకోవాలని, వ్యాధుల నివారణపై పశువైద్యులు సూచనల తీసుకోవాలన్నారు. పాడి రైతులకు, గొర్రెలు మేకల పెంపకం దారులకు ప్ర భుత్వాలు ఎన్నో ప్రోత్సాహకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాల ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ చంద్రశేఖర్, ఏపీఎం ఎఫ్‌టీఓ రమణప్ప, ఏపీయం వెంకటనారాయణ, సూర్యనారాయణ, జీవమిత్రలు, పొదుపుసంఘం మహిళలు పాల్గొన్నారు.

సంఘం పటిష్టంగా ఉండాలి

ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న తాలూకా నూతన కార్యవర్గం

ధర్మవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సంఘం పటిష్టంగా ఉంటే సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవచ్చని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ, జిల్లా అధ్యక్షుడు లింగా రామ్మోహన్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీహోంలో మంగళవారం ఎన్జీఓ తాలూకా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడిగా పెనుబోలు శంకర నారా యణ, కార్యదర్శిగా శ్రీనివాసులు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా గురు రాఘవేంద్ర, పెద్దన్న, ఎండీ.జిక్రా, వెంకటేశులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేశ్‌నాయక్, సంయుక్త కార్యదర్శులుగా విష్ణువర్ధన్‌రెడ్డి, అనితమ్మ, షఫీవుల్లా, రాజశేఖర్, జాహ్నవి, కోశాధికారిగా క్రిష్టప్ప ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ, జిల్లా అధ్యక్షుడు లింగా రామ్మోహన్ మాట్లాడుతూ... సమస్యలపై పోరాడి పరిష్కరించే సంఘం మన ఎన్జీఓ అసోసియేషన్ అన్నారు. సంఘం అభివృద్ధి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేయడం వలన పెనుబోలు శంకరనారాయణను రెండోసారి కూడా అధ్యక్షుడిగా ఎంపిక చేశారన్నారు. అనంతరం ఆయనను తోటి ఉద్యోగులు, మిత్రులు, పట్టణ ప్రముఖులు, టీడీపీ నాయకుఢి ఫణికుమార్, బీజేపీ నాయకులు హరీశ్‌బాబు, అంబటి సతీశ్‌బాబు, సాకే ఓబుళేశు తదితరులు ఘనంగా సత్కరించారు. ఎన్జీఓ అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సెక్రటరీ చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీంద్ర పాల్గొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ... ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషిచేస్తామని పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి దివ్యాంగుల క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

ముదిగుబ్బ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఏడు వరాలపై మండలం లోని దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. వారు మంగళవారం ముందుగా బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 'సీఎం సార్... ధర్యవాదాలు' అంటూ నినాదాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, టీడీపీ నాయకులు మల్లెల నారాయణస్వామి, చంద్రసేన, రఫీ, వేలూరి జయచంద్ర, చిన్న ఉత్తప్ప, అశోక్, గోపీ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఈవోగా ప్రసాద్

నల్లచెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం ఇన్‌చార్జ్ ఈవోగా ఎన్ ప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. హిందూపురం డివిజన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎన్ ప్రసాద్‌ను కదిరి గ్రూప్ ఆలయాల ఇన్‌చార్జ్ ఈఓగా నియమించారు. గతంలో ఈఓగా పనిచేసిన మురళీకృష్ణపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన సస్పెండ్ అయిన విషయం విదితమే. దీంతో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌కు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగిస్తూ ఇన్‌చార్జ్ ఈఓగా నియమించారు.

మీకు ప్రజలే బుద్ధి చెబుతారు

● వైసీపీ కదిరి ఇన్‌చార్జ్‌పై టీడీపీ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తనకల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై అవాకులు, చవాకులు పేలితే ప్రజలే మీకు తగిన బుద్ధి చెబుతారని వైసీపీ ఇన్‌చార్జ్ మగ్బూల్ బాషాపై టీడీపీ నాయకులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. తెలుగుయువత మండలాధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్, నాయకులు షేక్ మహబూబ్‌బాషా, పులికంటి నరసింహులు తదితరులు మంగళవారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడానికి ఈవీఎంల ట్యాపరింగే అని ఎన్నికల కమిషన్‌ను తప్పుదోవ పట్టిస్తున్నట్లుగా వైసీపీ కదిరి ఇన్‌చార్జ్ మగ్బూల్‌బాషా మాట్లాడడం సరికదన్నారు. వైసీపీ అధికారం కోల్పోయాక... ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంపై విషం చిమ్ముతోందన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పరితపించే నాయకుడు కందికుంట వెంకటప్రసాద్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. సీబీఐ నుంచి క్లీన్‌చిట్ పొందిన మా నాయకుడు కందికుంటను విమర్శిస్తే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. జగన్ చిన్నాన్న వివేకానందరెడ్డిని చంపడానికి కదిరి నుంచి గొడ్డలిని కొనుగోలు చేశారని మా ఎమ్మెల్యే ఎక్కడా అనలేదని, ఆ విషయాన్ని సీబీఐ నిర్ధారించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ అమలు చేయడంలేదని మగ్బూల్ బాషా అనడం, ఆయన అమాయకత్వానికి నిదర్శనమన్నారు. వైసీపీ వా ళ్ల మాటలను ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మీనాయకుడు, మీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని హితవు పలికారు.

విద్యుత్, విత్తన బిల్లుల ప్రతుల దహనం



తనకల్లులో బిల్లుల ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

తనకల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్, విత్తన బిల్లుల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యుత్ బిల్లులు 2025 ప్రకారం దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యుత్ సంస్థలన్నీ ప్రైవేటు పరం కానున్నట్లు పేర్కొన్నారు. దీని వల్ల తీవ్ర నష్టాలు సంభవిస్తాయన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన విత్తన బిల్లు వల్ల ప్రైవేటు, కార్పొరేటు విత్తన కంపెనీలు లాభపడతాయన్నారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శివన్న, వీవీరమణ, సీఐటీయూ వేమన్న, రైతులు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: మండలకేంద్రంలోని కదిరి- రాయచోటి ప్రధాన రహదారిపై రైతు సంఘం నాయకులు మంగళవారం విద్యుత్, విత్తన బిల్లుల ప్రతులను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టా మన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈకార్యక్రమాన్ని విజయవంతం చేస్తామ న్నారు. వీటిపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, నాయకులు గంగిరెడ్డి, సోమిరెడ్డి, నాగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సీఐటీయూ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీల్లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ధర్మవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు జేవీఈ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హె చ్ఎం సుమన, కోచ్ ఇనయాత్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని కళా జ్యోతి సర్కిల్‌లో ఉన్న జేవీఈ జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాల ఆవరణంలో మంగళవారం జిల్లా స్థాయి జూడో పోటీలలో వారు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ పోటీలు జూడో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ భాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీలలో 40కేజీల విభాగంలో గవ్వల యువ సంధ్యా, 44 కేజీలలో జాహ్నవి, మైనస్ 48కేజీలలో జనశ్రీ, జూనియర్ క్యాటగిరి మైనస్ 48 విభాగంలో గాజుల సుస్మిత, మైనస్ 52కేజీలలో కొండా అర్చన సత్తాచాటి బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. కర్నూల్‌లో ఈ నెల 19, 20, 21 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఆ విద్యార్థులను పాఠశాల హెచ్ఎం సుమన, పీఈటీలు స్వరూప, సరళ, టీడీపీ నాయకులు జింకా పురుషోత్తం, కేశగాళ్ల శ్రీనివాసులు, అసోసియేషన్ సెక్రటరీ శివ, కోచ్ ఇనాయత్‌బాషా అభినందించారు.

న్యూస్ బాక్స్

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక భోగసముద్రం చెరువు ఒడ్డున వెలిసిన దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అర్చకులు హేమంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీ ర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తుమ్మల మారెమ్మకు..



గుడిబండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలిసిన తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



వ్యవసాయ బోరు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

అగళి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలం ముక్కడంపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమస్యపై సర్పంచులకు, స్థానిక నాయకులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోందని, రైతులు కూడా నీటిని పట్టుకునేందుకు నిరాకరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పరిగి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల బజంత్రి గోపాల్ గుండెపోటుతో మృతిచెందడంతో ఇద్దరు కుమార్తెలు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు గోపాల్ ఇంటివద్దకు వెళ్లి రూ.56వేలు ఆర్థిక సాయాన్ని అర్పిత, వందనలకు అందజేశారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన అక్కాచెల్లెళ్లకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఇతర సమస్యలేవైనా ఉంటే తమదృష్టికి తీసుకురావాలని కోరారు. మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మహేశ్వర్‌రావు, వడ్డె హనుమయ్య, సర్పంచ్ బాలాజీ, సోమప్ప, యూజీ వెంకటేశ్, నేతులపల్లి లోకేష్, చెన్న కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న జనసేన పార్టీ నాయకులు

అగళి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు జనసేన పార్టీ నాయకులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య విషయాలపై వైద్యాధికారి శివానంద గర్భిణులకు అవగాహన కల్పించారు. అన్నదాన కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు భాను ప్రకాశ్, టీడీపీ నాయకుడు మాస్టర్ నరసింహప్ప, హెల్త్ సూపర్‌వైజర్ జయమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

రొద్దం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సర్వసభ్య సమావేశం 11న ఉదయం 11గంటలకు సమావేశం ఉంటుందని ఎంపీడీఓ ఆనంద్‌ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రాదేశిక సభ్యులు, జిల్లా ప్రాదేశిక సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి తరలి రావాలన్నారు.

కార్యదర్శిని నియమించండి

గుడిబండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయానికి పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. కార్యదర్శిగా ఇక్కడ పనిచేస్తున్న ప్రకాశ్ అగళి మండలానికి ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. వారం రోజులైనా పంచాయతీ కార్యదర్శిని నియమించకపోవడంతో వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించినా ఎవరూ బాధ్యతలు తీసుకోవడంలేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్యదర్శిని నియమించాలని వారు కోరుతున్నారు.

విద్యుత్, విత్తన బిల్లుల ప్రతుల దహనం

తనకల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్, విత్తన బిల్లుల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యుత్ బిల్లులు 2025 ప్రకారం దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యుత్ సంస్థలన్నీ ప్రైవేటు పరం కానున్నట్లు పేర్కొన్నారు. దీని వల్ల తీవ్ర నష్టాలు సంభవిస్తాయన్నారు.

● నంబులపూలకుంట: మండలకేంద్రంలోని కదిరి-రాయచోటి ప్రధాన రహదారిపై రైతు సంఘం నాయకులు మంగళవారం విద్యుత్, విత్తన బిల్లుల ప్రతులను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈకార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు.

కల్యాణమండపానికి స్థలం కేటాయిస్తాం

● బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న యాదవ సంఘం నాయకులు

పెనుకొండ టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలంలో అనువైన చోట యాదవ కల్యాణమండపానికి స్థలం కేటాయిస్తామని మంత్రి సవిత హామీ ఇచ్చారు. మంగళవారం రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య గోరంట్లకు చెందిన యాదవ సంఘం నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. మంత్రి మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి కల్యాణమండపం కోసం స్థల పరిశీలన వేగవంతం చేస్తామన్నారు. కల్యాణమండపం నిర్మాణానికి ఎంపీ బీకే పార్థసారథి నిధులు మంజూరయ్యేలా సిఫార్సు కూడా చేస్తానన్నారు. గుట్బూరు సూరీ పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): కడపలో 14వ తేదీన ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో 79వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి కడప ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను నాయకులు ఆహ్వానించారు. మంగళవారం ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోబ్రేనాయక్, జయకృష్ణ మంత్రిని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

రామచంద్రారెడ్డికి ఘన నివాళి

పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలం రాంపురం పంచాయతీ కొండంపల్లి సమీపంలో మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా మంత్రి సవిత, పార్టీశ్రేణులతో కలిసి నివాళులు అర్పించారు. సవిత తండ్రి ఎస్. రామచంద్రారెడ్డి సమాధి వద్దకు నాయకులు తరలివెళ్లారు. ఎస్ఆర్ఆర్ చారిటబుల్‌ట్రస్ట్ సభ్యులు, పలువురు టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి రామచంద్రారెడ్డి ఘాట్ వద్ద మాట్లాడుతున్న మంత్రి సవిత

సర్యరక్షణ చర్యలు పాటించాలి: ఏవో



రైతులకు సూచనలిస్తున్న ఏఓ విజయభారతి

సోమందేపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాయదశలో ఉన్న కందిపంటకు రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో విజయభారతి తెలిపారు. మంగళవారం సూచించారు. కేతగానిచెరువు, రెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతుల పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కాయ దశలో కాయతొలుచు పురుగు, మచ్చలపురుగు ఆశిస్తాయన్నారు. దీనికోసం రైతులు మందులు వాడాలన్నారు. వీఈఓ అలేఖ్య, రైతులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టూరు, చిన్నపరెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం వ్యవసాయాధికారులు నిర్వహించారు. వ్యవసాయాధికారి చందన మాట్లాడుతూ రాగి, వరి, మొక్కజొన్న, వేరుశనగ పండించే రైతులు ఎరువులు, మందులు సకాలంలో పిచికారి చేసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో చియా సీడ్స్ పంట సాగు చేయడంవల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వ్యవసాయాధికారులు, మాజీ ఎంపీపీ చిన్నవెంటక రాముడు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి చందన

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రిని అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

గోరంట్ల, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలకు ప్రభాస్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీవారు మంగళవారం క్రీ డా సామగ్రిని అందజేశారు. కొత్తచెరువుకు చెందిన సొసైటీ నిర్వాహకు డు ప్రభాకర్‌రెడ్డి రూ.15వేలు విలువ చేసే సామగ్రిని అందించారు. వాలీబాల్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ తదితర క్రీడా పరికరాలు విద్యార్థులకు ఇ చ్చారు. హెచ్ఎం ఈశ్వర్‌ప్రసాద్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, పీఈటీ అజీమ్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల ప్రారంభం



మాట్లాడుతున్న డీపీఎం రామిరెడ్డి

అమరాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక హేమా మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు సుజాతమ్మ, ఉపాధ్యక్షురాలు సుమ ఆధ్వర్యంలో యానిమేటర్లకు విజన్ బిల్డింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీపీఎం ఫైనాన్స్ అధికారి రామిరెడ్డి, ఐబీడీఎం సత్యనారాయణ, ఏపీఎం ముత్యాలప్ప పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2025-26, 27సంవత్సరంలో ఆర్థిక కార్యకలాపాలు ఎలా నిర్వహించాలనే దానిపై విజన్ బిల్డింగ్ శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. సీసీ భాస్కర్, ఐకేపీ ఏపీఎం ముత్యాలప్ప, వీరేష్, నాగరాజు, గోపాల్, ఎఫ్‌పీఓ శ్రీనివాసులు, అకౌంటెంట్లు వరలక్ష్మి, కెంచమ్మ, సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు చెల్లించిన ఎమ్మెల్యే

రొళ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పరీక్ష ఫీజు చెల్లించినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. విద్యార్థులకు విద్యాపరంగా ప్రోత్సహించడానికి రూ.43,875 చెల్లించినట్లు తెలిపారు. ఇదివరకే నియోజకవర్గస్థాయిలో డీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు కూడా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారన్నారు. విద్యార్థులకు భవిష్యత్తులో కూడా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.

రేపు ఎన్జీవో ఎన్నికలు

హిందూపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీఓ ఎన్నికలు గురువారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం తాలూకా అధ్యక్షుడు నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఎన్జీవో తాలూకా ఎన్నికలకు హిందూపురం మున్సిపాలిటీతోపాటు లేపాక్షి, చిలమత్తూరు, పరిగి మండలాల్లోని ఉద్యోగులు హాజరు కావాలన్నారు.

మోడల్ పేపర్ల పంపిణీ



విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రొద్దం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. మంగళశారం తురకలాపట్నం, నారనాగేపల్లి జడ్పీ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు యూటీఎఫ్ నాయకులు నరేష్ మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. ప్రతియేడాది టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీచేసి ఉత్తీర్ణత శాతం పెంచడానికి కృషిచేస్తుందన్నారు. ఎంఈఓ అరవింద్‌కుమార్, హెచ్ఎం వెంగప్ప, భాగ్యలక్ష్మి, గంగాధర్, ఓబులేసు, ఆది, దినేష్, అశోక్ పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

అగళి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు నగేష్ ఆచారి పొలం ఇరిగేపల్లి గ్రామ కాలేజీ సమీపంలో ఉంది. వ్యవసాయ బోరుకు అమర్చిన 457 మీటర్ల కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని ఆవేదన వ్యక్తం చేశారు. మేము గ్రామంలో లేని సమయంలో ఈ పని జరిగిందని వాపోయారు. ఈ విషయాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శోభారాణికి మంగళవారం బాధిత రైతు ఫిర్యాదు చేశారు.

కేజీబీవీ తనిఖీ

మడకశిర రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుమల కేజీబీవీ పాఠశాలను సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ) దేవరాజ్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటున్నా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం, పాఠశాలలోని వసతులు తాగునీరు, స్నానాల గదులు తదితర సమస్యలను ఏపీసీ దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు. అనంతరం తరగతి, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు త్వరలో కల్పిస్తామన్నారు. ఏపీసీ వెంట ఎంఈఓ భాస్కర్ ఉన్నారు.

గుడిబండ(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని జమ్మలబండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అమలు చేసిన 100రోజుల ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు పరీక్షలు నిర్వహించారు. ఎంఈఓ వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఏపీసీ దేవరాజ్

సిమెంటు ఫ్యాక్టరీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు

గోరంట్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తివారిపల్లి వద్దనున్న కస్తూరి సిమెంటు ఫ్యాక్టరీపై గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి క్రిమినల్ కేసు నమోదైంది. విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు కమర్షియల్ ట్యాక్స్, పొల్యూషన్ కంట్రోల్, బోర్డు, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారుల బృందం సిమెంటు ఫ్యాక్టరీపై సోమవారం దాడి చేసి, సీజ్ చేసిన విషయం తెలిసిందే. విజిలెన్స్ అధికారుల పరిశీలనలో సిమెంటులో బూడిద, (ఫ్లైయాష్), పీపీపీని అధికమోతాదులో కలిపి, నకిలీ సిమెంటు తయారు చేసినట్లు నిర్ధారించారు. నకిలీ సిమెంటును అల్ట్రాటెక్ సిమెంటు సంచుల్లో నింపి, కర్ణాటకకు ఒర్జినల్ సిమెంటుగా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. 340 సిమెంటు బస్తాలతోపాటు కర్ణాటకకు బయలుదేరుతున్న లారీని, 88 అల్ట్రాటెక్ ఖాళీ సంచులను అధికారులు స్వాధీనం చేసుకుని, గోరంట్ల పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. అల్ట్రాటెక్ సిమెంటు అధికారులచే కస్తూరి సిమెంట్ యూనిట్ యజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయించారు. లీగల్ మెట్రాలజీ అధికారులు 7 కేసులు నమోదు చేశారన్నారు. అలాగే యజమాన్యంపై కమర్షియల్ ట్యాక్స్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు శాఖల నిబంధనలు అతిక్రమించినందుకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ సిమెంటు తయారు చేసి, అమ్మడంతో రూ.కోట్లు పన్నును ఎగవేసినట్లు చెప్పారు. విజిలెన్స్ దాడిలో ప్రాంతీయ, విజిలెన్స్ ఎనోఫోర్సిమెంటు అధికారి ప్రసాద్, డీఎస్పీ నాగభూషణ, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ గోపాలుడు, ఏసీటీఓ రమేష్‌రెడ్డి, లీ గల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, పొల్యూషన్ బోర్డు ఏఈఈ కృష్ణారెడ్డి, అల్ట్రాటెక్ సిమెంటు ఫ్యాక్టరీ అధికారులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



అల్ట్రాటెక్ నకిలీ సంచులను పరిశీలిస్తున్న అధికారులు



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

చిన్నారులందరికీ పోలియోచుక్కలు వేయాలి

హిందూపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సురేష్ బాబు ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో పల్స్‌పోలియో నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. 21, 22, 23వ తేదీల్లో నిర్వహించే పోలియో చుక్కల కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. ప్రపంచంలో పోలియోరహిత భారత్‌గా నిలిపేందుకు అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు. 23 తరువత కూడా రెండ్రోజులపాటు ఇంటింటికి తిరిగి ఎవరైనా వేయించుకోకుండా ఉంటే వారిని గుర్తించి చుక్కలు వేయాలన్నారు. అవసరమైతే మొబైల్ బూత్‌ల ద్వారా చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలానికి రక్షణ కల్పించండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోరంట్ల, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూపురం ప్రధాన రహదారి పక్కన ఎస్సీ హాస్టల్ భవనం ముందున్న ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా రక్షణ కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ మారుతిని మంగళవారం కోరారు. దళిత, బలహీనవర్గాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఎస్సీ హాస్టల్ భవనం కోసం దాతలు ఉచితంగా స్థలాన్ని ఇచ్చారన్నారు. వసతి గృహం ముందున్న ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉండడంతో కులసంఘాల వారు, వారి నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసుకునే నిమిత్తం ప్రయత్నాలు జరుపుతున్నట్లు చెప్పారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం కావడం సరికాదన్నారు. విగ్రహాల ప్రతిష్ఠకు ప్రభుత్వ స్థలాన్ని అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. సైకిల్ నరసింహులు, మేకల క్రిష్టప్ప, గంగన్న, దండోరా నారాయణ, రమేష్, హేమంత్‌కుమార్, ఆటో విజయ్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దాం



గోపీనాథ్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

పెనుకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కొత్తగా ఎంపికైన గోపీనాథ్‌ను ఎంఈఎఫ్ నాయకులు, బీజేపీ నాయకులు, పెనుకొండ అంబేడ్కర్ నగర్ యూత్, కోనాపురం ఎస్సీ కాలనీవాసులు ఆయనకు పూలమాలలువేసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషిచేస్తామన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేద్దామన్నారు. నాయకులు రామక్రిష్ణ, రామాంజనేయులు, వేదవ్యాస్, రవి పాల్గొన్నారు.

టెట్‌ను మినహాయించండి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

రొళ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్‌ను మినహాయించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు యంజారప్ప డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదులో భాగంగా వారు మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలలు పర్యటించి మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. పీఆర్సీ కమిటీ వెంటనే వేసి 30శాతం ఫిట్మెంట్ ఇవ్వాలని, పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలని, వందరోజుల కార్యక్రమంలో పాల్గొన్న టెన్త్ విద్యార్థులకు సీసీఎల్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు శ్రీనివాసులు, చంద్రబాబు, గట్టి శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కుంగిన రోడ్డు.. భయాందోళనలో ప్రజలు

సోమందేపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో మూడేళ్ల క్రితం వేసిన రోడ్డు కుంగిపోవడంతో రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు కాలనీవాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఆదమరిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నెలరోజులుగా పరిస్థితి ఇలాగే ఉందని పేర్కొన్నారు. అంబేడ్కర్ కూడలి నుంచి కుడివైపునకు వెళ్లే దారిలో ఈ పరిస్థితి ఉందని, అధికారులు, నాయకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.



కుంగిన సిమెంటు రోడ్డు

విత్తన వేరుశనగ పంపిణీ



రైతులకు విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మడకశిర రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రబీ పంటల సాగు చేస్తున్న రైతులకు 40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. మండలానికి 500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ వచ్చాయన్నారు. క్వింటాల్ వేరుశనగ రూ.9200 కాగా 40 శాతం సబ్సిడీ పోను రూ.5520 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మంగళవారం వైబీహళ్ళి రైతు సేవా కేంద్రంలో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. విత్తనాలు కావల్సిన రైతులు పట్టాదారుపాసుపుస్తకం, ఆధార్ కార్డు, వ్యవసాయ బోరు విద్యుత్ బిల్లుతో పాటు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.